



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు

# వార్త


## బిట్రగుంట వద్ద పట్టాలు తప్పిన గూడ్సు





**బిట్రగుంట, జులై 26 ప్రభాతవార్త** దక్షిణ మధ్య రైల్వే విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్ర గుంట రైల్వే స్టేషన్ దక్షిణాన శుక్రవారం వేకువజామున 4.40 గంటల ప్రాంతంలో నెల్లూరు నుండి ఒంగోలు వైపు సరుకుల లోడుతో వెళ్తున్న గూడ్సు వ్యాగిన్ పట్టాలు తప్పింది. ఈ వారంలో ఇదే ప్రాంతంలో ఇదే సమయంలో గూడ్సు పట్టాలు తప్పడం రెండో సారి. ఈ నెల 23వ తేదిన ఎరువుల లోడుతో వెళ్తున్న గూడ్సు మూడు వ్యాగిన్లు పట్టాలు తప్పగా ఈ రోజు ఒక వ్యాగిన్ పట్టాలు తప్పింది. నెల్లూరు నుండి బిట్రగుంటకు వస్తుండగా మెయిన్ లైన్‌లో నుండి యార్డులోకి వెళ్తూ క్రాస్ ఓవర్ పాయింట్‌లో ఒక వ్యాగిన్ రెండు చక్రాలు పట్టాల కిందకు దిగాయి. వెంటనే అధికారులు రైల్వే సిబ్బందిని అప్రమత్తం చేసేందుకు సైరన్ కాల్ మోగించారు. యుద్ధప్రాతిపదికపై పట్టాలు తప్పిన వ్యాగిన్‌ను మెయిన్ ట్రాక్‌పైకి తీసుకొచ్చి పట్టాలకు మరమ్మతులు చేశారు. గత రెండు దఫాలు గూడ్సు పట్టాలు తప్పిన సమయంలో పక్క లైన్లలో ఎటువంటి రైళ్ల రాకపోకలు జరగకపోవడంతో రైల్వే అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలో తనిఖీల కోసం వచ్చి వున్న ఉన్నతాధికారుల బృందం ప్రమాదవార్త తెలుసుకుని సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేపట్టారు.

## ఆంధ్రప్రదేశ్‌కు ఆరు నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు స్కిల్ సెంటర్లు

### లోక్‌సభలో ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నకు కేంద్ర సహాయ మంత్రి సమాధానం



**నెల్లూరు రూరల్, జులై 26, ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి శుక్ర వారం లోక్ సభలో నేషన ల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు స్కిల్‌సెంటర్ల ఏర్పాటుపై ప్రశ్నలువేశారు. దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో కేంద్ర ప్రభుత్వం 95 నేష నల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు స్కిల్ సెంటర్లను మం జూరు చేసిందా? ఆంధ్రప్రదేశ్‌లో కేవలం ఆరు నీల్స్ స్కిల్ సెంటర్లు మాత్రమే ఏర్పాటు చేశారా, చేస్తే వాటి వివరాలు తెలలియజేయాలని కోరారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు ఆంధ్రప్రదేశ్‌ని ఎఐఐఎంఎస్‌లో ఎన్ఈఎల్ ఎస్ఎస్‌సి లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రైవేట్ విద్య కళాశాలల్లో వీటి ఏర్పాటుకు సబ్సిడీ ఇవ్వాలన్న ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందా అని ఆరా తీశారు. ఈ ప్రశ్నలకు కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ లిఖితపూర్వకంగా సమా ధానమిచ్చారు. నేషనల్ ఎమర్జెన్సీ లైఫ్ సపోర్టు స్కిల్ సెంటర్ల ఏర్పాటు కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వ వైద్య కళాశాలలు, స్వయం ప్రతి పత్తి గల సంస్థలు సంబంధిత కేంద్ర సంస్థల నుండి వచ్చిన నామినేషన్ల ఆధారంగా ఉంటుందన్నారు. 2021 - 26 కాలానికి భౌగోళిక ప్రాతినిధ్యం, జనాభాను పరిగణనలోకి తీసుకుని దేశవ్యాప్తంగా 120 నీల్స్ నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెఎప్పారు. దీని ప్రకారం 23 జులై, 2024 నాటికి, మంత్రిత్వ శాఖ ద్వారా మొత్తం 95 కేంద్రాలు మంజూరు చేసినట్లు ఆమె తెలిపారు. వీటిని కేవం కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ కళాశాలకు, స్వయం ప్రతిపత్తి గల సంస్థలకు మాత్రమే ఇస్తున్నట్లు చెప్పారు. వీటిలో ఆరు కేంద్రాలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంజూరు చేయగా శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాల, తిరుపతి, ఆంధ్ర మెడికల్ కళాశాల, విశాఖపట్నం, గుంటూరు మెడికల్ కళాశాల, గుంటూరు, రంగరాయ మెడికలల్ కళాశాల, కాకినాడ, సిద్ధార్థ మెడికల్ కళాశాల, విజయవాడ, ఎయిమ్స్ మంగళగిరి కళాశాలలకు కేటాయించినట్లు చెప్పారు.

## ఏపీలో శాశ్వత భవనాలు లేని అంగన్వాడీలు ఎన్ని..?

**నెల్లూరు రూరల్, జులై 26, ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంట్ సభ్యులు శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి శాశ్వత భవనాలు లేని అంగన్‌వాడీలకు సంబంధించి శుక్రవారం లోక్ సభలో ప్రశ్నించారు. 2023లో 75 శాతం అంగన్వాడీలను ఉపాధి హామీ పథకం కార్మికులు నిర్మించారనేది వాస్తవమేనా, అలా అయితే, వాటి వివరాలు కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో శాశ్వత భవనం లేని అంగన్‌వాడీల వివరాలు, జిల్లాల వారీగా సమాచారాన్ని సంబంధిత మంత్రిత్వ శాఖను కోరారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో గత ఏడాది జిల్లాల వారీగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాల సంఖ్య, 2024 - 25 సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యం వివరాలు తెలియజేయాలన్నారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రశ్నలకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి లిఖిత పూర్వక సమాధానాలు ఇచ్చారు. మిషన్ సాక్షం అంగన్‌వాడీ, పోషణ్ 2.0 కింద, ఐదేళ్ల వ్యవధిలో 50 వేల అంగన్‌వాడీ భవనాల నిర్మాణం అంటే సంవత్సరానికి 10 వేల భవనాలను నిర్మించాలన్న ప్రొవిజన్స్ ఉన్నాయన్నారు. ఉపాధి హామీ పథకంకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి అయ్యే ఖర్చు రూ. 12 లక్షలు అయితే ఇందులో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ కింద రూ. 8 లక్షలు, 15వ ఫైనాన్స్ కమిషన్ ప్రకారం రూ. 2 లక్షలు, కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ ద్వారా రూ. 2 లక్షలు అందించబడుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన సమాచారం ప్రకారం 23149 అంగన్‌వాడి కేంద్రాలకు శాశ్వత భవనాలు లేవని తెలిపారు. 2023 - 24లో రాష్ట్రంలో 170 అంగన్‌వాడీల నిర్మాణానికి కేంద్ర మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపిందని వివరించారు. ఇక నెల్లూరు జిల్లా పరిధిలో 2934 అంగన్‌వాడీలు పనిచేస్తుండగా వాటిల్లో 1162 అంగన్‌వాడీలు అద్దె భవనాన్ని కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి సమాధానమిచ్చారు.

## విధుల్లో సమయపాలన నిర్దిష్టంగా పాటించండి కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, జులై 26, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య నిర్వహణ పనులలో ప్రతిరోజు నిర్దిష్టమైన సమయపాలనను కార్మికులంతా పాటించేలా పర్యవేక్షించాలని శానిటేషన్ విభాగం అధికారులను కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక తడికల బజార్ తోటబడి, పత్రి వారి వీధి, స్టోన్ హౌస్ పేటచకాంతమ్మ ఆశ్రమం, ఏసీ నగర్ తదిత ర ప్రాంతాల్లోని మస్టర్ పాయింట్లను కమిషనర్ శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలోని సిబ్బంది క్రమం తప్పకుండా మస్టర్ పాయింట్లలో హాజరు వేయించుకోవాలని, కార్మికులంతా నిర్దేశించిన రక్షఫ ఉపకరణాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. అనంతరం తోటబడి, పప్పుల వీధి, వాటర్ ట్యాంక్ లలోని త్రాగునీటి పంపింగ్ స్టేషనులను కమిషనర్ పరిశీలించారు. పంపింగ్ స్టేషన్లో త్రాగునీటి నాణ్యత పరీక్షలను ప్రత్యేకంగా కమిషనర్ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రతిరోజు నిర్దేశించిన సమయానికి త్రాగునీటి సరఫరా ప్రణాళికాబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, షిఫ్టులవారీగా క్రమం తప్పకుండా వాల్వ్ ఆపరేటర్లు విధులు నిర్వర్తించేలా పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం స్థానిక చిల్డ్రన్స్ పార్క్ ను కమిషనర్ ప్రత్యక్షంగా ఐదు రూపాయల టికెట్ కొనుగోలు చేసే పార్క్ లోపలికి ప్రవేశించారు. పార్కులో నిరుపయోగంగా, శిధిలావస్థలో ఉన్న ఫౌంటైన్లను పరిశీలించి గతంలో వినియోగిస్తున్న మ్యూజికల్ ఫైట్ ఫౌంటేన్ పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ క్రీడా వస్తువులు, వ్యాయామ పరికరాలను పరిశీలించి వాటి పునరుద్ధరణకు అవసరమైన మరమ్మత్తు చర్యలు చేపట్టాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. పార్కు నేమ్ బోర్డును విద్యుత్ వెలుగులతో ఉండేలా నూనతంగా రూపొందించాలని సూచించారు. పార్కులోని పిచ్చి మొక్కలు, వ్యర్థాలను పూర్తిగా తొలగించి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉండేలా పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. పార్కులోని స్విమ్మింగ్ ఫూల్‌నిర్వహణ తీరు, చిన్న పిల్లల కోసం స్విమ్మింగ్ ఫూల్ ప్రాంగణంలో తీసుకుంటున్న రక్షణ చర్యలు ఫూల్ లో వినియోగిస్తున్న నీటి ప్రమాణాలను అధికారులను అడిగి కమిషనర్ తెలుసుకున్నారు. వైరింగ్ లోపాలు, కాలిపోయిన దీపాలను వాటి స్థానంలో అమర్చాలని, నగరవ్యాప్తంగా విద్యుత్ దీపాల వెలుగుకు ఎక్కడ అంతరాయం వాటిల్లకుండా ప్రతిరోజు పర్యవేక్షించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ విద్యుత్ విభాగం డి ఈ నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

## గవ్వల అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి



**కోవూరు జూలై 26 ప్రభాతవార్త** : కోవూరులోని రైల్వే రోడ్డు ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆషాఢ మాస శుక్రవారం పర్వదినం సందర్భంగా అమ్మవారికి గవ్వలతో ప్రత్యే అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు నం దకిషోర్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ లుచేపట్టారు. ఆలయచైర్మన్ సీహెచ్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి రమేష్‌బాబు, పెద్ద సంఖ్యలో భక్తులు ఉన్నారు.

# వెంకటగిరినుండి వలస వచ్చి...నెల్లూరులో ప్రాణాలు వదిలి

### చిన్న కెఎన్ఆర్ పాఠశాలలో గోడ కూలి విద్యార్థి మృతి
### బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ విద్యార్థి సంఘాల ఆందోళన
### బాధితులకు అండగా ఉంటామంటూ ప్రకటించిన మంత్రులు నారాయణ,లోకేష్
### మృతుని కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించి కలెక్టర్ ఆనంద్







**నెల్లూరు, జులై26 ప్రభాతవార్త-విద్య** ఉన్న ఊరిలో జీవనోపాధి కరువు అవ్వటంతో అక్కడనుండి నగరానికి వచ్చి అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా జీవనం సాగిస్తూ తన ఇద్దరు బిడ్డలను చదివించుకుంటూ జీవిస్తున్న తల్లిదండ్రుల ఆశలు అడిఆశలైయ్యాయి.... చదువుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుతారనే భావాలను నేర్పించి రోజూ పాఠశాలకు పంపిస్తే ... చదువుకునేందుకు వెళ్లిన బడిలోనే గోడకూలి విద్యార్థి మృతి చెందటంతో ఆ తల్లిదండ్రుల ఆవేదనకు అవధులు లేకుండా పోయాయి....ఈ హృదయవిదారక సంఘటన శుక్రవారం నగరంలోని స్థానిక బివి నగర్‌లోని చిన్న కేఎన్ఆర్ పాఠశాలలో చోటు చేసుకుంది.

బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి నెల్లూరుజిల్లా వెంకటగిరిలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కొత్తపాళెం గురవయ్య, రూపలులకు ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు కొత్తపాళె ం సందీప్, ద్వితీయ కుమారుడు కొత్తపాళెం మహేంద్ర. ఉన్న ఊరిలో సరైన జీవనాధారం లేకపోవటంతో గురవ య్య దంపతులు నాలుగేళ్ల క్రితం నెల్లూరు నగరా నికి వలసవచ్చి నగరంలోని ఇస్కాన్‌సిటీ ప్రాంతంలో అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. పిల్లలు ఇద్దరిని నగరంలోనే చదివించసాగారు. మహీంద్రా నెల్లూరునగరంలోని బివి నగర్‌లోని చిన్న కెఎన్ఆర్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పాఠశాలకు వెళ్లిన మహీంద్ర తోటి స్నేహితులతో కలిసి ఆడుకుంటున్న సమయంలో పాటశాల ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న అదనపు గదులగోడ, సన్‌సెడ్ కూలి విద్యార్థి మహే ంద్ర తలపై పడటంతో సంఘటనా స్థలంలోనే విద్యార్థి మృతి చెందాడు. ఈవిషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, ఆర్డీఓ మలోలా, తెలుగుదేశం నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ,జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్‌లు సంఘటా స్థలాన్ని పరిశీలించి మృతుని కుటంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. మృతుని కటుంబానికి అన్ని విదాలా ఆదుకునేల చర్యలు తీసుకుంటామని నాయకులు ప్రకటించారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతు సంఘటన సాయంత్రం జరగటంతో పెను ప్రమాదం తప్పిందని, అదే పాఠశాల జరిగే సమయంలో జరిగిఉంటే మరింత పెద్ద ప్రమాదం జరిగేదని ఆందోళన వ్యక్తంచేశారు. సంఘటనపై విచారణ చేయిస్తున్నామని, దోషులకు తప్పకుండా శిక్షపడేలా చేస్తామన్నారు. కాగా పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న గదులు పూర్తి నాశిరకంగా నిర్మిస్తున్నారని, ఈ విషాద ఘటనకు సదరు నిర్మాణదారులే కారణమని వెంటనే వారిని శిక్షించాలని విద్యార్థి సంఘాలు పాఠశాల ఏదుట ఆందోళన నిర్వహించారు. మృతుని మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్‌ను అడ్డుకుని రాస్తా రోక్కో చేశారు. అక్కడే ఉన్న పోలీసులు విద్యార్థి సంఘ నాయకులను అడ్డుకుని మృతదేహాన్ని శవపంచనా మా నిమిత్తం జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా పాఠశాలకు వెళ్లిన తన కుమారుడు విగత జీవుడవ్వటంతో మృతుని తల్లిదండ్రుల ఆవే దనకు అవదులు లేకుండా పోయ్యాయి. విద్యార్థి మృత దేహాన్ని చూస్తూ ఆతల్లి చేసిన ఆర్ధనాదాలతో పాఠశాల ఆవరణలో తీవ్ర విషాద చాయలు అలముకున్నాయి.

**మృతుని కుటుంబానికి అండగా ప్రభుత్వం:** మంత్రులు లోకేష్, నారాయణ నెల్లూరు నగరంలో పాఠశాల గోడకూలి విద్యార్థి మృతి చెందిన సంఘట తెలుసుకున్న రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, పొంగూరు నారాయణలు ఈ అంశంపై అసెంబ్లీలో స్పందించారు. పాఠశాలలో ఇటువంటి విషాద సంఘటన చోటుచేసుకోవటం విచారకమన్నారు. దీనిపై విచారణ చేపట్టి నిందితులను శిక్షిస్తామని, అలాగే మృతుని కుటుంబానికి అన్ని విదాల తమ ప్రభుత్వం సహాయ సహకా రా లుఅందిసుందని వారు ప్రకటించారు.

**మృతుని కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం :** జిల్లా కలెక్టర్ ఆనంద్ గోడ కూలి విద్యార్థి మృతి చెందిన ఘటనలో బాధితులకు ప్రభుత్వం తరపున రూ.5లక్షల నష్టపరిహారాన్ని అందించనున్నామని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. అ లాగే రాష్ట్ర మంత్రుల ఆద్వర్యంలో నేడు (శని వారం)బాధిత కుటుంబానికి నష్టపరిహార చెక్‌ను అందించటం జరుగుతుందన్నారు. త్వరిగ గతినఈ ప్రమాద ఘటనపైవిచారణ చేపతామన్నారు.

**విద్యార్థి సంఘాలకు, పోలీసులకు మద్యతీవ్ర వాగ్వాదం:** విద్యార్థి మృతి చెందిన సంఘటను తెసుకున్న విద్యార్థి సంఘ నాయకులు సంఘటనా స్థాలానికి చేరుకుని ఘటన జరిగిన తీరును పరిశీలించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతు జిల్లా విద్యా శాఖ అధికారులు, సమగ్రశిక్ష అధికా రులు సకాలంలో స్పందించి ఉంటే ఈ దుర్ఘటన జరిగి ఉండేది కాదని, వాపోయారు. నాశిరకంగా తరగతి గదుల నిర్మాణం జరుగుతున్నా అధికా రులు స్పందించలేదని ఫలితంగానే నేడు ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. కాగా అక్కడినుండి పోలీసులు విద్యార్థి మృతదేహాన్ని అంబులెన్స్‌లో తరలిస్తుండగా విద్యార్థి సంఘ నాయకులు అడ్డుకుని రాస్తా రోక్కో నిర్వహించారు. పోలీసులు ఎంత చెప్పినా నాయకులు వినక పోవటంతో ఇరు వర్గాల మద్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. విద్యార్థి సంఘ నాయకులను పోలీసులు లాగి పారేసి అంబులెన్స్‌ను జిల్లా ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. కాగా పోలీసులు తమపై ఇలా ప్రవర్తి ంచటం దారుణమని ,వెంటనే అవితీనికి పాల్పడిన వారిని శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.



## విద్యార్థి మృతి పై మంత్రి నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి



**నెల్లూరు, జులై 26, ప్రభాతవార్త - వైద్యం** నగరంలోని కేఎన్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఓ విద్యార్థి మరణించారన్న విషయం తెలుసుకున్న రాష్ట్రమంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అమరావతిలోని తన ఛాంబర్‌లో ఉన్న మంత్రి నారాయణకు ఆ సమయంలో అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ ఈ ప్రమాద విషయాన్ని తెలియజేశారు. పాఠశాలలో గోడ కూలి తొమ్మిదో తరగతి చదువుతున్న గురమహేంద్ర (14) అనే విద్యార్థి దురదృష్టవశాత్తు మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన పై వెంటనే విచారణచేపట్టాలని నెల్లూరు జిల్లా డిఈవోకు ఆదేశాలు జారీ చేసారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున అండగా నిలుస్తామని హామీ, భరోసా ఇచ్చారు. ప్రభుత్వం తరపున రూ. 5 లక్షల పరిహారం ప్రకటిస్తున్నట్లు మంత్రి నారా యణ ప్రకటించారు. శనివారం తాను నెల్లూరుకు చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వం తరపున రూ. 5 లక్షలు చెక్కును అందించనున్నారు.

# కామాక్షితాయి సాక్షిగా నేను ఏ తప్ప చేయ్యలేదు

### కన్నీరు పెట్టుకున్న పుట్టా సుబ్రమణ్యంనాయుడు







**బుచ్చి జులై 25 ప్రభాతవార్త** శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సాక్షిగా నేను ఎటువంటి తప్పు చెయ్యలేదని జొన్నవాడ దేవస్దానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు స్పష్టం చేశారు. విలే కర్ల సమావేశంలో ఆయన ఉద్వేగానికి గురై కన్నీ టి పర్యంతమైయ్యారు. 8 కోట్లు రూపాయాలు నేను తిన్నానని,,,,,, అమ్మవారి నగదు స్వాహా చేశానని నాపైన కావాలని లేనిపోని ఆరోపణలు చేశారని ఆయన కన్నీరు పెట్టుకున్నారు. రెండు దఫాలు నాలుగు సంవత్సరాలు నేను చైర్మన్‌గా దేవస్దానంను దాతల సహకారంతో నేను అనూ హ్యారీతిలో అభివృద్ధి చేశానని ఆయన తెలిపారు. జొన్నవాడ దేవస్దానం విషయం 3 రోజులుపాటు లెక్కలు చూసిన అధికారులు నాకు ఎటువంటి నోటీ సులు ఇవ్వలేదని ఆయన పేర్కొన్నా రు. కొంత మంది కావాలని నాకు నోటిసులు వచ్చినట్లు పుకార్లు పుట్టించారని ఆయన తెలిపారు. ఎంతో మంది దాతల సహాకారంతో నేను దేవాలయాన్ని అభివృద్ధి చేశాను. ఏనాడు దాతలు నాపైన ఎటువంటి ఆరోపణలు చెయ్యలేదు. కాని సోషల్ మీడియాలో నాపైన విభిన్న కధనాలు ప్రచారం చేశారు. నాలుగు సంవత్సరాలు నేను చేసిన అభి వృద్ధిని బూడిదలో పోసిన పన్నీరు చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.. ఎటువంటి ఆధారాలు లేకుండా దేవస్దానం పైన ఇటువంటి కధనాలు వ్రాస్తే భక్తులు ఇకపైన విలువైన కానుకలు ఇస్తా రా ! అని ఆయన ప్రశ్నించారు. నాపైన కావాలని పొలిటికల్ హై డ్రామా నడిచింది ఇది ముమ్మాటికి వాస్తవని అన్నారు. చైర్మన్‌కి ఎక్కడ చెక్కు పవర్ ఉండదని ఈవిషయాన్ని తెలుసుకోవాలని అన్నారు. దాతల సహకారంతో ఆలయాన్ని వెడల్పు చేసినా, ఆలయం ముందు రేకులు షెడ్డు వేసినా, హోమాలకు ప్రత్యేకంగా గది ఏర్పాటు చేసినా, గోశాల కట్టించాని, అన్నదాన సత్రం కట్టించినా అన్ని దాతలు వారి మనుషుల్ని పెట్టుకొని కట్టించుకు న్నారు. దాతలు ఎప్పుడు నా అకౌంట్లు డబ్బులు వెయ్యలేదు. కోటి కుంకుమార్చనకు దేవాదాయశాఖ అనుమతులు తీసుకొని దాతలు చేసుకున్నారు అందులో నాపాత్ర ఏమిలేదు. అప్పట్లో రాజ్యసభ సభ్యులుగా ఉన్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి. ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మహా కుంభాభిషేకంకు పూర్తి స్దాయిలో సహకరిం చారు. కంచి కామకోటి పీఠాదిపతులను తీసుకొని వచ్చేందుకు నేను 10 సార్లు కంచికి వెళ్లాను. మహాకుంభిభిషేకం నిర్వహించాం. నేను ఎక్కడ ఒక్క రూపాయి ముట్టుకోలేదు . అమ్మవారి దయవల్ల నాకు చాలినంత ఆస్తులున్నాయి. అమ్మవారి సొమ్ము తినాల్సి న అవసరం నాకు లేదు." అదిగో పులి అంటే ఇదిగో తోక " అన్న చందాన నాపైన లేనిపోని నిందలు వేశారు.

ప్లేటు కలక్షన్ ఖచ్చితంగా నేను హుండిలో వేయాలని పట్టుబడితే అప్పటి శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నా! అర్చకులంతా తమ కుటుంబాలు బ్రతకాలని అంటున్నారు ప్లేటు కలక్షన్ వదలి వేయమని చెప్పినా నేను అందుకు సమ్మతించలేదని అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు, కోటికుంకుమార్చనకు, మహాకుంబాభిషేకానికి ప్రస్తుత ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రస్తుతం శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వల్లూరు రవీంద్రరెడ్డి, కామాక్షమ్మ, హైదరాబాద్‌కు చెందిన కొలను రాజారెడ్డి, పూజితమ్మ, బండి లక్ష్మీనరసారెడ్డి, ఇలా అనేక మంది దంపతుల సహాకారంతో అభివృద్ధి చేశాను. కోటి కుంకుమార్చన తరువాత 10 లక్షల రూపాయాలు పిక్సెడ్ డిపాజిట్ చేయడం జరిగింది. నేను పదవులో లేకున్నా సాలహారం నిర్మాణానికి దాతల వద్దకు వెళ్లి వారిని ఒప్పించి 30 లక్షలు ఇప్పించి సాలహారం ఏర్పాటు చేయించాను. మొట్టమొదట నేను పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి శాసనసభ్యులుగా ఉన్న సమయంలో దేవస్దానం చైర్మన్ అయ్యాను. తరువాత నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి శాసనసభ్యులుగా ఉన్న సమయంలో చైర్మన్‌గా చేశాను. ఒక్కసారి చేసిన చైర్మన్‌కి అవగాహన ఉండదు. రెండో వసారి నేను పూర్తి స్దాయిలో అవగాహనతో ఆలయ అభివృద్ధి చేశాను. ఆలయ అభివృద్ధిలో మీడియా పాత్ర కీలకంగా ఉన్నింది, కామాక్షితాయి సన్నిధిలో జరిగే ప్రతి కార్యక్రమాన్ని మీడియా ఎంతో పోకస్ చేసిందని అన్నారు. సోషల్ మీడియాలో లేని పోని నిందలు వేయడం మంచి విదానం కాదని అన్నారు.

నేను కేంద్రంలో ఒక కీలకమైన వ్యక్తి ద్వారా ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి పైరవీలు చేసినట్లు కధనాలు వచ్చాయి. ఇవ్వన్ని అవాస్తవాలు అని ఆయన స్పష్టం చేశారు. పెన్నానది పోర్లు కట్టలు తెగి ఉర్లకు వూర్లు మునిగిపోయాయి. గ్రావెల్ దోచుకున్నవారున్నారు. బ్యాంకులలో అవకతవకలు జరిగాయి. అవన్ని వదిలి వేసి నాపైన ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజిసమని ఆయన ప్రశ్నించారు. 8 కోట్లు కుంభకోణమని అంటున్నారు. ఈనగదు బ్యాంకు అకౌంట్లో నుండి చైర్మన్ తీయ్యగలరా అని ఆయన ప్రశ్నించారు. దేవస్దానం కు సంబందించి ఏ నగదు తీయాలన్నా ఇఒకి, కమీషనర్‌కి వాళ్లకు మాత్రమే అదికారం ఉంది. చైర్మన్‌కి కమీటికి ఏటువంటి సంబందంలేదని విషయం కూడా తెలియకుండా ఆరోపణలు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. నేను ఎటువంటి విచారణకైనా సిద్దమని ఆయన సష్టం చేశారు.

## పుట్టా సుబ్రమణ్యంనాయుడపై నిందలు సరికాదు : దాతలు

పుట్టా సుబ్రమణ్యంనాయుడుపైన నిందలు వేయడం సరికాదు జొన్నవాడ కామాక్షితాయి ఆలయం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడుపైన నిందలు వేయడం సరికాదని దాతలు పిడూరు శంకర్‌రెడ్డి, తమ్మినేని మల్లికార్జుననాయుడు, చిట్టుమూరు వెంకటరెడ్డి విలేఖర్ల సమావేశంలో స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధి పనులు దాతలు సొంత మనుషుల్ని పెట్టుకొని చేయడం జరిగిందని అన్నారు. విలేకర్ల సమావేశం జరిగే సమయంలో అనేక మంది దాతలు ఫోన్ల ద్వారా పుట్టా సుబ్రమణ్యం నాయుడు చాలా మంచి వాడని విలేఖర్లకు స్పష్టం చేశారు. ఆయన మరోసారి దేవస్దానం చైర్మన్‌గా ఉంటే మేము లక్షల రూపాయాలు నిదులు ఇచ్చి అభివృద్ధి చేస్తామని వారు స్పష్టం చేశారు. తెలుగు దేశంనాయకులు బత్తల హరికృష్ణా, టౌన్ అద్యక్షులు ఎం.వి శేషయ్య, గుత్తా శ్రీనివాసులు, మహేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కావలి రూరల్, జులై 26 ప్రభాతవార్త :** సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండి అవగాహన పెంచుకోవాలని కలిగిరి మండలం సిద్దనకొండూరు ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యులు డాక్టర్ టి.రోహిణి తెలిపారు. పబ్లిక్ హెల్త్ అవుటరీల్ ప్రోగ్రాంలో భాగంగా కావలి ముసునూరు దివ్యాంగుల కాలనీలో డాక్టర్ టి.రోహిణి ఆధ్వర్యంలో దివ్యాంగుల కాలనీ అధ్యక్షులు, టిడిపి



విభిన్న ప్రతిభావంతుల రాష్ట్ర ఉపాధ్యక్షులు మండవ వెంకట్రావు ఆహ్వానం మేరకు శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ రోహిణి 60 మందికి షుగర్, బిపి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు వచ్చేందుకు ఆస్కారం వున్నందును ముందు జాగ్రత్తగా ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి వ్యాధుల పట్ల అప్రమత్తంగా వుండాలని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ టి.మాధవి మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు పిల్లలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ఆ విధంగా వివాహాలు చేసినట్లయితే శిక్షార్హులే కాకుండా ఎన్నో ఇబ్బందులు పడతారన్నారు. పిల్లలకు తల్లి లేదా తండ్రి మృతి చెందినట్లయితే మా దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వం సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. మండవ వెంకట్రావు మాట్లాడుతూ దివ్యాంగులు, నిరుపేద ప్రజలు ఎక్కువుగా నివసిస్తున్న దివ్యాంగుల కాలనీలో ఉచిత వైద్యశిబారాన్ని ఏర్పాటు చేసిన ఆయుష్ శాఖ వారికి, వైద్యాధికారి డాక్టర్ టి.రోహిణికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ కె.రాజ్యలక్ష్మి, వైద్యశాల కంపౌండర్ కృష్ణకుమార్, యంయన్‌వో ఎన్.సుబ్రమణ్యం, టిడిపి కావలి నియోజకవర్గ విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు నన్నూరి మాధవరావు, దివ్యాంగ నేతలు శైలేష్, శెట్టిపల్లి రామయ్య, సిహెచ్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ముదివర్తిలో గ్రామసభ

**విడవలూరు, జులై 26, ప్రభాతవార్త:** మండలం ముదివర్తి గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ కార్యక్రమం స్థానిక ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలజీవన్ పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయ కులు ఎస్ కే రఫీ, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి చక్రం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## జింగల్ పథకం ద్వారా రోడ్డు చదున

**విడవలూరు, జులై 26, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో రోడ్డు ఇరువైపులా జింగిల్ పథకం ద్వారా చదున చేయడం జరిగింది. ఈ కార్యక్రమం పంచాయతీ కార్యదర్శి ఉదయ్ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రెల్ ప్రభుత్వ పథకం ద్వారా ఈ పనులు చేయడం జరుగుతుందని ఇది ఇరువైపులా రోడ్డు ప్రమాదం జరగకుండా ఉండడం కోసం మంచి పథకం ప్రధాన మంత్రి ప్రవేశ పెట్టడం ప్రజలకు ఎంతో సంతోషమని తెలియజేశారు. ఆయనతో పాటు పంచాయతీ సెక్రెటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఆరోగ్య కుటుంబ సంక్షేమ , వైద్య విద్యాశాఖ మంత్రి

**ఉదయగిరి, జులై 26, ప్రభాతవార్త:** వెలగపూడి లోని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యాశాఖ మంత్రి శ్రీ సత్తి కుమార్ యాదవ్ గారిని రాష్ట్ర స్వచ్చంద సేవా సంస్థల సమాఖ్యతో కలిసి ఆంధ్రప్రదేశ్లోని ప్రభుత్వ ఆసుపత్రులలో, తగినంత సిబ్బంది. పరికరాలు లేవని నెల్లూరు జిల్లా ఉదయగరి ప్రభుత్వ ఆసుపత్రి 50 పడకలుగా మార్చారని కానీ ఆసుపత్రిలో మహిళ గైనకాలజిస్ట్ గాని, పిల్లల డాక్టర్లు గాని. తగినంత సిబ్బంది లేరని, అలాగే కడప జిల్లా బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా గైన్‌కాలజిస్టు, రేడియాలజిస్టు, పిల్లల డాక్టర్లు లేరని 50 పడకల ఆసుపత్రి ఉన్న సరైన వస్తువులు లేవని అన్ని జిల్లాల ప్రభుత్వ ఆసుపత్రులను విజిట్ చేసి, సిబ్బందిని, నియమించి, సరి అయిన వసతులు కల్పించాలని కోరగా ఆయన అంగీకరించారు రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల సమాఖ్య ముఖ్య సలహాదారు, మామిడిపల్లి బాలగంగాధర్ తిలక్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.



## దగదర్తి గ్రామ పంచాయతీలో గ్రామసభ

**దగదర్తి, జులై 26 ప్రభాతవార్త :** దగదర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో దగదర్తి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మాలేపాటి భాను, కంచర్ల కృష్ణ, ఉపసర్పంచ్ కడియాల నాగేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ ఈశ్వరమ్మలు పాల్గొన్నారు. ఈ సభలో తెలుగుదేశం పార్టీ నాయకులు మాలేపాటి భాను మాట్లాడారు. దగదర్తి మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడతామన్నారు. పంచాయతీలో పరిశుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలని కోరారు. అంటువ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సభలో సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



## సైనికుల ప్రాణత్యాగంతో కార్గిల్ యుద్ధంలో భారత్‌కు విజయం లభించింది కార్గిల్ యుద్ధవీరులు మారుబోయిన యానాది




**కావలి, జులై 26 ప్రభాతవార్త :** వివిధ రేంజ్‌ల పరిధిలకు చెందిన 587 మంది సైనికుల ప్రాణత్యాగంతో కార్గిల్ యుద్ధంలో భారత్‌కు విజయం లభించిందని కార్గిల్ యుద్ధవీరుడు మారుబోయిన యానాది తెలిపారు. 25వ కార్గిల్ విజయ్‌దివస్ సందర్భంగా కావలి మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో కావలి బిపిఎస్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు బి.వి.రాజారావు నాయకత్వంలో జరిగిన ఈ ర్యాలీలో అఖిల భారతీయ పూర్వ సైనిక్ సేవాపరిషత్, రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ తదితర సంస్థల ప్రతినిధులు సంఘీభావంగా పాల్గొన్నారు. కార్గిల్ యుద్ధంలో గాయపడిన సైనికుడు మారుబోయిన యానాదిని ఘనంగా సత్కరించారు. అనంతరం యానాది మాట్లాడారు. కార్గిల్ యుద్ధంలో గాయపడి నెల రోజులు కోమాలో వున్నానన్నారు. ఉగ్రవాదుల ముసుగులో పాకిస్థాన్ సైనికులు కార్గిల్ శిఖరాలపై చేరి బంకర్లు ఏర్పాటు చేసుకుని వున్నా అత్యంత సాహసంతో మన సైన్యం వారిని తరిమికొట్టి జులై 26వ తేదిన టైగర్‌హిల్స్‌పై మన జాతీయ పతాకాన్ని ఎగురవేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వసైనిక్ సేవా పరిషత్ కావలి శాఖ కన్వీనర్ డాకారపు రవిప్రకాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పాకిస్థాన్‌తో రెండు సార్లు, చైనాతో ఒకసారి జరిగిన యుద్ధాలలో మన దేశం సాంకేతికంగా యుద్ధ విజయం సాధించడం దౌత్యపరమైన లోపాల వల్ల యుద్ధ ఫలితాలు నిరాశపరిచాయన్నారు. కార్గిల్ యుద్ధ సమయంలో అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి అన్ని దేశాల మద్దతు కూడగట్టి పాకిస్థాన్‌ను ఏకాకి చేసి దౌత్యపరంగా కూడా విజయం సాధించి మన భూ భాగాలను కాపాడారన్నారు. యుద్ధ సమయంలో భారత ప్రజలు సైన్యానికి సంఘీభావంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు రాజారావు మాట్లాడుతూ తమ మాజీ సైనికుల భవనం కేంద్రంగా యువత, విద్యార్థులలో దేశభక్తిని రగిలించే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ సైనిక్ సేవా పరిషత్ ప్రతినిధి యం.జమున, రోటరీ క్లబ్ ప్రతినిధులు స్వర్ణలత, సలీంబేగ్, గోపీకృష్ణ, కోటేశ్వరరావు, సురేంద్రకుమార్, రహీంబాషా, జాన్, శ్రీనివాసులు, సాలోమన్, సతీష్‌బాబు, వెంకటేశ్వర్లు, వెంకట రమణయ్య, రమణయ్య, చిట్టిబాబు, నరసారెడ్డి, రెడ్‌క్రాస్ రక్త కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి అవగాహన



**వింజమూరు, జులై26, ప్రభాతవార్త :** వింజమూరు వ్యవసాయ శాఖ సహాయక డైరెక్టర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి పచ్చిరొట్ట ఎరువులపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమానికి జిల్లా ప్రకృతి వ్యవసాయ డిపిఎం మాలకొండయ్య , వ్యవసాయ శాఖ ఎడి రామిరెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున భూములను ఖాళీగా ఉంచకుండా సేద్యాలు చేసి పచ్చిరొట్ట ఎరువులను వేయాలన్నారు. 9నుంచి 30రకాల విత్తనాలను భూమిలో చల్లితే అవి పెరిగితే 40రోజుల్లో భూమిని కలియదున్నితే సేంద్రీయ ఎరువుగా భూమికి మంచి సారం ఇస్తుందన్నారు. గ్రామాల్లో ఎక్కువమంది రైతులు సుమారు 20సెంట్లు భూమిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కిచెన్ గార్డ్స్‌ను ఏర్పాటు చేసి వారికి ఉపాది కల్పించేలా చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపి అంజనారెడ్డి, ప్రకృతి వ్యవసాయదారులు పాల్గొన్నారు.

## డయాలసిస్ సెంటర్ ను త్వరితగతిన ఏర్పాటు చేయాలి

**వింజమూరు, జులై26, ప్రభాతవార్త :** రాష్ట్ర రాజధాని అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశంలో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఉదయగిరి నియోజకవర్గంలో వింజమూరు, దుత్తలూరు సెంటర్లలో డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు ఆవశ్యకతను శాసనసభ దృష్టికి తీసుకెళ్ళారు. జిల్లా కేంద్రానికి సుమారు 100కిలోమీటర్ల దూరంలో మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధిలో వెనుకబడి ఉందని సరైన వైద్యానికి నోచుకొనక రోగగ్రస్తులుగా మిగిలి ఉన్నారని, మరికొందరు ప్రాణాలు విడిచిన సంఘటన లను తాను కళ్ళారా చూశానన్నారు. ఇటీవల దుత్తలూరు మండలంలో ఒక చిన్నారి నిద్రిస్తున్న సమయంలో పాము కాటేయడంతో చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు సరైన వైద్యసౌకర్యాలు లేకపోవడంతో ఆ చిన్నారి మృతిచెందిన సంఘటన తనను ఎంతో బాధించిందన్నారు. కొన్ని మారు మూల గ్రామాలకు మంచినీటి సౌకర్యం కూడా లేదని కిలోమీటర్ల మేర నడిచి వెళ్ళాల్సిన పరిస్థితి ఉందని , విశాలమైన భూభాగమున్నప్పటికీ తాగునీరు, సాగునీరు లేక భూములు బీడు భూములుగా మారాయన్నారు. సాగునీరు అందిస్తే వేలాది ఎకరాలను సాగు చేయవచ్చన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో అత్యధికమంది డయాలసిస్ పేషంట్లు ఉన్నారని, ఫ్లోరిన్ వలన ఎంతో మంది కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అనేకమంది నెల్లూరుకు వెళ్ళి డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. కావున వైద్య, ఆరోగ్య మంత్రి ఉదయగిరి, వింజమూరులో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.



## డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలి



**ఉలవపాడు, జులై 26, ప్రభాతవార్త :** డ్రగ్స్ రహిత సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఉలవపాడు ఎస్సై బాజిరెడ్డి సూచించారు. ఉలవపాడు జీవీఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ నుండి యువతను, విద్యార్థులను చైతన్య పరిచేందుకు శుక్రవార మాదక ద్రవ్యాల దుష్పలితాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై బాజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ భారినపడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. రాష్ట్రం నుండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ మోజులో పడి తమ భవితను నాశనం చేసుకుంటున్నారని, అటువంటి వారిలో చైతన్యం నింపేందుకు తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులు సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి గోపిచంద్, ప్రకాష్, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ మహ్మద్ రఫీ, లైబ్రరీ అధ్యాపకులు హనుమంతరావు, విద్యార్థులను మోటివేట్ చేశారు. అనంతరం ఎస్సై బాజిరెడ్డిని కళాశాల సిబ్బంది సత్కరించారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఉప విద్యాశాఖాధికారి

**అనుమసముద్రంపేట, జులై26, ప్రభాతవార్త :** ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కె.గోపాల్ శుక్రవారం ఏఎస్‌పేట మండలంలోని శ్రీకొలను గ్రామ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిక్ష సప్తహ కార్యక్రమంలో భాగంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై ఆరా తీశారు. అనంతరం పాఠశాలలోని అన్ని తరగతులను పరిశీలించి 10వ తదగతి విద్యార్థులను ఇంగ్లీష్ సబ్జెక్ట్‌ను చదివించి వారి స్థాయిని పరిశీలించారు. ఐఎపిబి ప్యానల్ పనితీరు, నాడు-నేడు పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పాఠశాల అభివృద్ధికి సంబంధించి తగిన సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు జి.నిరంజన్, ఉపాధ్యాయులు , సిబ్బంది పాల్గొన్నారు.



## అన్న క్యాంటిన్‌ను పరిశీలించిన కావలి ఆర్డీవో శీనానాయక్

**కావలి, జులై 26 ప్రభాతవార్త :** కావలి పట్టణ తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో వున్న అన్న క్యాంటిన్‌ను కావలి ఆర్డీవో, మున్సిపల్ స్పెషలాఫీసర్ వి.కె.శీనానాయక్ మున్సిపల్ అధికారులతో శుక్రవారం పరిశీలించారు. ఆగస్టు 15 ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్న క్యాంటిన్లను సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా కావలి ఆర్డీవో అధికారులను పురమాయించారు. అన్న క్యాంటిన్‌ను పూర్వ వైభవంగా తీర్చిదిద్దాలన్నారు. అన్న క్యాంటిన్‌లో పేద ప్రజలు ప్రశాంతంగా టిఫిన్, భోజనం చేసేలా వసతులు ఏర్పాటు చేయాలన్నారు. అధికారులకు పలు సూచనలు అందజేశారు. ఆర్డీవో వెంట మున్సిపల్ టిపివో బాబురావు, మున్సిపల్ డిఇ, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ చవల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని సత్కరించిన మాజీ ఎమ్మెల్యే వంటేరు

**కావలి, జులై 26 ప్రభాతవార్త :** కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని విజయవాడలో శుక్రవారం కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాలరెడ్డి పూలబొకె అందజేసి సత్కరించారు. వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కావలి నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజల ప్రశంసలు అందుకోవాలని వంటేరు కోరారు. వారిద్దరి మధ్య వున్న సత్సంబంధాలను నెమరువేసుకున్నారు.



## జనసేన పార్టీ సభ్యత్వ నమోదు



**అల్లూరు, జులై 26 ప్రభాతవార్త :** జనసేన పార్టీ 4వ విడత క్రియాశీలక కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని అల్లూరు పాత బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అళహరి సుధాకర్ పాల్గొని మాట్లాడారు. కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమంపై స్పెషల్ డ్రైవ్ అవగాహన సదస్సు నిర్వహించారు. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు కార్యకర్తల సభ్యత్వ నమోదులో మహిళలను కూడా చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అల్లూరు మండల అధ్యక్షుడు కార్తీక్‌శర్మ, కత్తుల విజయ్‌కుమార్, చేవూరు సుబ్రమణ్యం, బెజవాడ రవికుమార్, కత్తుల వినయ్, నాగేంద్ర, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హియర్ నోఅపోజిషన్... పంచాయతీని మోడల్‌గా తీర్చిదిద్దుదాం

**జలదంకి, జులై26, ప్రభాతవార్త :** పంచాయతిలో ప్రతిపక్షమనేదేలేదు అందరం మనమే ఐక్యత కనపరచి పంచాయతీని అన్నివిధాల అభివృద్ధి పరచి మోడల్ గ్రామంగ తీర్చిదిద్దుదామని కావలి మాజీ శాసనసభ్యుడు వంటేరు వేడుగోపాలరెడ్డి పిలుపునిచ్చాడు. జలదంకి మండలం బ్రాహ్మణక్రాక బిట్‌వన్, అగ్రహారం బిట్2 సచివాలయాలలో పాలకుల ఫోటోల ఆవిష్కరణ కార్యక్రమం వంటేరు ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగ ప్రధాని మోడి, సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్, ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యుడు కాకర్ల సురేష్ పటాలను పండుగ వాతావరణంలో ఏర్పాటుచేశారు. సర్పంచ్ సుధాకర్, ఉపసర్పంచ్ దగ్గుమాటి మాల్యాద్రిరెడ్డి, మండల కూటమి నేతలుపులిగుంట మధుమోహన్‌రెడ్డి ,వంటేరు జయచంద్రారెడ్డి, పూనూరు భాస్కర్‌రెడ్డి, మారెళ్ళ బ్రహ్మారెడ్డి, కంచర్ల శరత్‌బాబు, చల్లా హనుమా రెడ్డిబండారు తిరుపతిరెడ్డి, వంటేరు రాకేష్, , నిమ్మలపల్లి రామచైతన్య, అప్పలనాయుడు, మునగాల తిరుమల రెడ్డి, స్వర్ణా కొండపనాయుడు, గంగపట్లమాలకొండయ్య, పచ్చా పెంచలనాయుడు, శ్రీనాద్‌రెడ్డి తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. బిట్‌వన్ సచివాలయంలో జరిగినసమావేశంలో వేణుగోపాలరెడ్డి మాట్లాడుతు ఎంఎల్ఎలు కాకర్ల సురేష్, దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల సహకారంతో మాజీ ఎంఎల్ఏగ నేను, పంచాయతి పాలకులైన మీరు అందరం ఒకే మాటకు కట్టుబడివుండి పంచాయతీని అబివృద్ధి పదంలో నడిపిద్దామని అన్నారు. అందుకు మండల కూటమి నేతల సాయం ఎలాగు వుంటుందని హర్షద్వానాల మధ్య ప్రకటించారుఇప్పటికే ఎంపి వేమిరెడ్డి రెండు వాటర్ ప్లాంట్లు ప్రకటించివున్నారని మిగతా అభివృద్ధి కూడా చేయాల్సి వుందని తెలియజేశారు. ఈపరిణామానికి హాజరైన గ్రామస్తులు నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తంచేశారు. ఇక మన పంచయతీ అభివృద్ధి నల్లేరుమీద నడకేనని చర్చించుకోవడం గమనార్హం.

## ఓటర్ల తీర్పు అమోఘం... దాష్టిక పాలనకి చమరగీతం పాడారు

**జలదంకి, జులై26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఓటర్లు తీర్పు ఎంతో కొనియాడదగ్గదని ఐదేళ్ళ వైఎస్ జగన్ దాష్టిక పాలనకు చమరగీతం పాడేందుకుచేయిచేయి కలిపి సంచలన తీర్పిచ్చారని కావలి మాజీ శాసనసభ్యుడు వంటేరు వేడుగోపాలరెడ్డి శ్లాఘించాడు. జలదంకి మండలం తన స్వగ్రామమైన బ్రామ్మణక్రాక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేఖర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ముఖ్యంగ నెల్లూరు జిల్ల ప్రజలను ఎంత పొగిడినా తక్కువే అవుతుందని ఎందుకంటే జిల్లాలో వైసిపికి చాన్స్ లేకుండా చేయడమంటే చిన్న విషయం కాదన్నారు. తెలుగుదేశంపార్టిఎంపి అభ్యర్దిగ ఎప్పుడైతే వేమిరెడ్డి పేరు చంద్రబాబునాయుడు ప్రకటించాడో అపుడే జిల్లా స్వరూపమే మారిందని అన్నారు. అందుకు ఉదయగిరిశాసనసబ్యుడు కాకర్ల సురేష్, కావలి ఎంఎల్ఎ దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డిలు తమదైన శైలిలో ప్రజలకు సేవచేయాలన్న తలంపుతో రాజకీయాలలోకి వచ్చారని వారి ఏలుబడిలో ఈరెండు నియోజక వర్గాలు అభివృద్ధిలో ముందంజ వేస్తాయని చెప్పారు. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు. ఐదేళ్ళూ దోచుకోవడమే పరమావదిగ పనిచేశారని ఫలితంగ రాష్ట్ర దివాళా తీసిందని పెదవివిరిచారు. అంతెందుకు మనకావలిని మాజీ ఎంఎల్ఎ ప్రతాప్‌కుమార్‌రెడ్డి, అయన అనుచరులు ఎక్కడా వదలకుండ దోపిడి చేశారని ఉదహరించాడు. ఉదయగిరి నియోజక వర్గాన్ని జగన్‌మోహన్‌రెడ్డి మేకపాటి వారికి దారాదత్తం చేయడం వెనుక నియోజకవర్గం వారి జాగీరా అని ప్రశ్నించాడు. ఇక్కడ వారికి తప్పవేరొకరికి అవకాశమే లేదన్న రీతిగ ప్రగల్బాలు పలికారని మేకపాటి వారు నియోజక వర్గానికి ఒక్క మేలైనా చేశార అని నిలదీశాడు. అందుకేఅపార అనుభవం వున్న చంద్రబాబునాయుడు మీద వున్న నమ్మకం ప్రేమతో ప్రజలు ఆయన వైపు మొగ్గారని వివరించాడు. అయితే ఈఎన్నికలఎపిసోడ్‌లో జనసేనాని పవన్‌కళ్యాణ్ పాత్రను ప్రత్యేకంగ చేప్పుకొని తీరాల్సిందేనని అన్నారు. ఎందుకంటే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండాఅయన తీసుకున్న కాంక్రీట్ నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. దీనివల్లే కూటమికి 164సీట్లు వచ్చాయని తెలియజేశాడు. ఇక జలదంకి మండల విషయానికి వస్తే వైకాపాకి కంచుకోటలాంటిదని 2019ఎన్నికలో 8వేల పైచిలుకు మెజారిటి ఆపార్టీకి కట్టపెట్టారాని అయితేమొన్నటి ఎన్నికల్లో అందరం కలిసికట్టుగ పనిచేసి కష్టపడడంవల్ల దాదాపు ఈక్వల్ చేయగలిగామని అన్నారు. ఇది గొప్ప పరిణామంగ ఆయనఅభివర్ణించారు. ఇదే స్పూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేసి వైసిపిని కనుమరుగు చేస్తామనిఉద్ఘాటించారు. ఈసమావేశంలో నేతలు చేవూరు జనార్ధన్‌రెడ్డి, పంచాయతి సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఇండ్ల సుధాకర్, దగ్గుమాటి మాల్యాద్రిరెడ్డి, మారెళ్ళ బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభలను నిర్వీర్యం చేస్తున్న అధికారులు



**ఉదయగిరి, జులై 26, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉదయగిరిలోని పంచాయతీ కార్యాలయంలో ఉదయగిరి ఎంపిడీవో డి ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హర్ ఘర్కోజిల్ అలాగే బహిర్గత మాలమూత్ర విసర్జన మీద అధికారులు మాట్లాడారు. అసిస్టెంట్ ఇంజనీర్ నరసింహ రావు మాట్లాడుతూ 2014లో అప్పటి ప్రభుత్వం గ్రామస్థాయి నుండి స్వచ్ఛభారత్ అనే కార్యక్రమం ద్వారా దేశం పరిశుభ్రంగా ఉండాలని ప్రతి ఇంటికి మరుగుదొడ్లను మంజూరు చేసి ప్రజలలో విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొన్ని నెలలపాటు ఈ కార్యక్రమం పకడ్బందీగా జరిగిన తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో మరి ముఖ్యంగా గ్రామస్థాయిలో ఆరుబయట మాలమూత్ర విసర్జన జరుగుతూనే ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహించి మరుగుదొడ్లకు లేని వారికి మంజూరు చేస్తుందని ఇంజనీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరు క్షయ వ్యాధికి సంబంధించిన టీకా వేయించుకోవాలని షుగర్ వ్యాధిగ్రస్తులు 60 సంవత్సరాలు దాటిని ప్రతి ఒక్కరు ఈ టీకా వేయించుకోవడం వలన రాబోయే రోజుల్లో క్షయ వ్యాది వచ్చే అవకాశం లేదని అలాగే కుష్టు వ్యాధి మీద సర్వే జరుగుతుందని తెలిపారు. ఎంపిడీవో డి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రజలు పరిశుభ్రత మీద అప్రమత్తంగా ఉండాలని ప్రతి ఒక్కరూ తమ సమ్యలను పంచాయతీ దృష్టికి తీసుకెళ్తే పరిష్కార దిశగా చర్యలు చేపడతామని అన్నారు. ఉదయగిరి మాజీ సర్పంచ్ షేక్ రియాజ్ మాట్లాడుతూ గ్రామ సభలలో ప్రజలు లేరని గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమం కల్పించడం ముఖ్యమని ఆ రీతిగా అధికారులు చొరవ చూపాలని ఆయన ఊక దంపుడు ఉపన్యాసాలతో అధికారులు తూ తూ మంత్రంగా కార్యక్రమాల్ని ముగిస్తున్నారని క్షేత్రస్థాయిలో సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టడం లేదని గత ప్రభుత్వం ప్రజల యొక్క ఆరోగ్యాన్ని పూర్తిగా విస్మరించ్చిందని ఘటుగా విమర్శించారు. ఉదయగిరి లోని బస్టాండ్ సెంటర్ కూరగాయల మార్కెట్ తాసిల్దార్ కార్యాలయంలో ఎక్కడ కూడా మరుగుదొడ్లు లేవని ఆరుబయట మాలమూత్ర విసర్జన చేయడం నేరమని జెబుతున్న అధికారులు సమస్యను నిర్మూలించి అందుకు తగిన ఏర్పాట్లు చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. ఉదయగిరి బస్టాండ్ సెంటర్లో నిర్మించిన మరుగుదొడ్లు ఉపయోగకరంగా లేకుండా ఉన్నాయని ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్న గత ప్రభుత్వం ఇలాంటి విషయాలు మీద అవగాహన లేక పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమానికి ఉదయగిరి సర్పంచ్ ఉప సర్పంచ్ గైరాజరవ్వడంపై స్థానిక నాయకులు మండిపడ్డారు. ప్రజల సమస్యలను తీర్చడానికి ఏర్పాటు చేసిన గ్రామ సభలకు గ్రామస్థాయి నాయకులు రాకపోవడం సమస్యలను అవగాహన చేసుకోకపోవడం ఒకటేనని ఉదయగిరి పంచాయతీ బ్రష్టు పట్టిందని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఉదయగిరి పంచాయతీ ప్రజల నుండి పన్నులు వసూలు ముక్కు పిండి వసూలు చేస్తున్నప్పుడు వారి సమస్యలను తీర్చడంలో ఎందుకు మొఖం చాటేస్తుందని అధికారులను ప్రశ్నించారు. ఉదయగిరి బస్టాండ్ సెంటర్లో ఉన్న ప్రయాణికుల బస్సు షెల్టర్‌ను పంచాయతీ ఆధ్వర్యంలో పెట్టుకొని ఉదయగరిరి డిపో మేనేజర్ శ్రీనివాసులు తమకు అప్పగిస్తే వాడుక లోకి తీసుకొస్తామన్నా కూడా వారితో చర్చలు ఇంతవరకు జరపకపోవడం వారి పనితనానికి నిదర్శనమని మురుగు కాలువలు నిండిన డ్రైనేజీలు స్వచ్ఛమైన త్రాగునీరు లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులు అధికారులకు కనిపించడం లేదా అని ఆయన అధికారులు నిలదీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి కరీముల్లా మాట్లాడుతూ పలు శాఖలకు సంబంధించిన అధికారులు నాయకులు ఇచ్చిన సలహాలను సూచనలను పరిగణలోనికి రాబోయే రోజుల్లో ప్రణాళిక బద్ధం గా చర్యలు చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నగదు బహుమతి



**సంగం జులై 26 ప్రభాతవార్త :** సంగం మండలంలోని గాంధీజనసంఘం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024వ సంవత్సరంలో 10 వ తరగతి ఫలితాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాదించిన అవినాశ్, ముఖేశ్ ,ఆసిఫా అనే విద్యార్దులకు కీర్తి శేషులు యాటగిరి శేషమ్మ జ్ఞాపకార్ధం ఆమె కుమారుడు వై.పెంచలయ్య 4 వేలు, 3 వేలు, 2 వేలు నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు. అలాగే హిందిలో 98 మార్కులు సాధించిన కుమారి ఆసిఫాకి పాఠశాల హిందీ ఉపాధ్యాయులు మదు 5 వేల నగదు బహుకరించారు. వీరిద్దరి దాతృత్వానికి పాఠశాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్దులు పాల్గొన్నారు.

## పంచాయితీలో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి



**ముత్తుకూరు, జులై 26, ప్రభాతవార్త :** ముత్తుకూరు పంచాయితీలో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు సర్పంచ్ బూదూరు లక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక సీనియర్ టిడిపి నాయకులు ఈదురు రామ్మోహన్ రెడ్డి, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నీల మల్లికార్జున యాదవ్‌తో కలిసి హిందు స్మశాన వాటికను పరిశీలించారు. స్మశాన వాటిక చుట్టూ పారిశుద్ధ్యం పేరుకుపోయిందని వెంటనే తొలగిస్తామన్నారు. సర్వేపల్లి, శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో రాబోయే రోజుల్లో ముత్తుకూరు పంచాయితీని ఆదర్శ పంచాయితీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల మైనారిటీ నాయకులు అబ్దుల్ షఫీ ఉల్లా, అక్కయ్యగారు ఏడుకొండలు, సర్వేపల్లి ఐటి విభాగ నాయకులు తిరుమల శెట్టి సతీష్ నాయుడు, శంకర్, మణి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రమేష్ రెడ్డికి మిఠాయి తినిపించిన బీద రవిచంద్ర



**నెల్లూరు, జులై 26, ప్రభాతవార్త - వైద్యం :** అఖిల భారత ఎన్‌టిఆర్ అభిమాన సంఘం అధ్యక్షులు, మాజీ మంత్రి తాళ్లపాక రమేష్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం విజయవాడలోని అతిథి గృహంలో ఆయనకి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ రెడ్డి సతీమణి తాళ్లపాక అనురాధ తదితరులు ఉన్నారు.

## చంద్రబాబుకి పాలాభిషేకం చేసిన టిడిపి నేతలు



**నెల్లూరు, జులై 26, ప్రభాతవార్త - వైద్యం:** గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన 217 జీవోను రద్దు చేసిన సందర్భంగా కోవూరు నియోజకవర్గ కుడితిపాలెం తెలుగుదేశం పార్టీ నాయకులు సిఎం చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గురువారం అసెంబ్లీలో మత్స్యశాఖ మంత్రి, అచ్చం నాయుడు, 217 మత్స్యకర జీవో చర్చకు రాగా ఎమ్మెల్యే కొండబాబు ఈ జీవో వల్ల మత్స్యకార జీవితాలు ఆర్థిక స్థితిగతులు దెబ్బతింటున్నాయని మనం ప్రభుత్వం వచ్చిన తర్వాత జీవో రద్దు చేస్తామని, మత్స్యకారులకు ఎన్నికల ముందు హామీ ఇవ్వడం జరిగిందని, అందుకని ఈ జీవోను రద్దు చేయాలని గత వైసిపి హయాంలోనే టిడిపి నాయకులను కోరడం జరిగిందని అగ్నికుల క్షత్రియ జిల్లా అధ్యక్షుడు జ్ఞానేంద్ర తెలియజేశారు. గతంలో కొల్లు రవీంద్ర రాష్ట్రంలో సభలు సమావేశాలు నిర్వహించి ఈ జీవోను రద్దు చేయాలని వైసిపి ప్రభుత్వం మీద నిరసనలు చేపట్టమన్నారు. 217 జీవో రద్దుకు నిర్ణయం తీసుకున్నందుకు శుక్రవారం నెల్లూరు జిల్లా, కోవూరు నియోజకవర్గం, కుడితిపాలెం నందు తెలుగుదేశం పార్టీ నాయకులు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్, అచ్చం నాయుడు, కొల్లు రవేంద్ర, కొండబాబు, బొమ్మిడి నాయకర్, పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ నాయకులు రావిళ్ళ వీరేంద్ర చౌదరి ఆధ్వర్యంలో, అప్పాని శ్రీనివాసులు ఎంపిటీ, అనిల్, ఇందుకూరుపేట సుబ్రమణ్యం, కోదండరాం రెడ్డి, షేక్ ఇసామ్రయిల్, దొడ్లమల్లి, శ్రీనివాసులు రెడ్డి, చెన్నయ్య, వెంకయ్య, సుబ్రమణ్యం తదితర మహిళలు పాల్గొన్నారు.

## భూ యాజమానులు పంట సాగుదారులకు సహకరించాలి

**పొదలకూరు, జులై 26, ప్రభాతవార్త :** భూ యాజమానులు పంటసాగుదారులకు పంటసాగు హక్కు పత్రాలకు అంగీకార పత్రము ఇవ్వడం ద్వారా పంట సాగుదారునికి భూమిపై ఎటువంటి హక్కు సంక్రమించదని వ్యవసాయాధికారి పేర్కొన్నారు. పంట సాగుదారు హక్కు పత్రాల ద్వారా పంటసాగుదారునికి 11 నెలల కాలానికి పత్రము చెల్లుబాటు అవుతుంది. ఈ పత్రము పొందిన సాగు రైతుకు పంటనష్టపోయినప్పుడు ప్రభుత్వం నుండి వచ్చు పెట్టుబడి రాయితీ, పంటల భీమా పథకం పంటసాగు గ్రూపులకు బ్యాంక్ ఋణాలు, సాగుచేసిన పంటను మద్దతు ధరకు అమ్ముకొనేందుకు మాత్రమే పనికి వస్తుంది. భూ యాజమానులు పంట సాగు హక్కు పత్రము సాగుదారునికి ఇప్పించినందు వల్ల భూ యాజమాని ఎటువంటి ఆందోళన పడవల్సిన అవసరం లేదన్నారు. భూమి పై సర్వహక్కులు భూ యాజమానికే ఉంటాయని తెలిపారు. పంటసాగు హక్కు పత్రం పొందినందుకు పంటసాగుదారులు భూ యాజమానికి యొక్క ఖాతా నెంబరు, ఆధార్ నెంబర్, పంటసాగుదారునికి యొక్క ఆధార్ నెంబరుతో గ్రామ రెవెన్యూ అధికారికి, గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి వివరాలను సమర్పించి పంట సాగు హక్కు పత్రాన్ని పొందవచ్చన్నారు.

## ఖాళీ స్థలం.. వ్యాధులకు నిలయం



**ఉలవపాడు, జులై 26, ప్రభాతవార్త :** ఉలవపాడు మండలంలో ఖాళీ స్థలాలు దోమలు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. వాటి నిర్వహణను స్థల యజమానులు పంచాయతీ అధికారులు పూర్తిగా మరిచారు. ఫలితంగా మురుగునీరు కుంటలు, చెత్త కుప్పలు కంపచెట్లతో దర్శనమిస్తున్నాయి. అందులోనే విషపురుగులు నివాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. సమీపంలో నివాసం ఉనన వారు అసౌకర్యానికి గురవుతున్నారు. స్థల యజమానులను గుర్తించి నోటీసులు ఇస్తామని చెప్పి పుంపుతున్నారు. మండలంలో ప్రతి గ్రామంలో దాదాపు మురుగు కుంటలు ఉన్నాయి. వాటి నిర్మూలనకు పంచాయతీ అధికారులు ఎలాంటి ప్రణాళికలు అమలు చేయడం లేదు. చట్టం ఏం చెబుతోంది. 1965 పురపాలక చట్టం ప్రకారం ఖాళీ స్థలాల నిర్వహణను నిర్లక్ష్యం చేసే యజమానులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఖాళీ స్థలాల వల్ల ప్రజారోగ్యానికి సాధారణ జనజీవనానికి ప్రమాదం వాటిల్లితే పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా ప్రాథమికంగా చర్యలు తీసుకుంటారు. స్థల యజమానులు అప్పటికి స్పందించకపోతే కమీషనర్ నోటీసులు జారీ చేస్తారు. అయినా నిర్లక్ష్యం చేస్తే పురపాలక సంఘానికి చెందిన స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది ద్వారా నోటీసులు అందజేసి కోర్టులో కేసు నమోదు చేస్తారు. ఆరోపణ రుజువైతే జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉంది. ప్రజారోగ్యం పాలిట ప్రమాదంః నివాస ప్రాంతాల మధ్య గల ఖాళీ స్థలాలు ప్రజారోగ్యం పాలిట అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఖాళీ స్థలాల నిర్వహణను వాటి యజమానులు పట్టించుకోకుండా వదిలేశారు. పంచాయతీ తమది కాదని చెబుతోంది. యజమానులు అధికారులు ఈ సమస్యను ఇలాగే వదిలేయడంతో ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యంపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## ఆరోగ్యంపై అవగాహన



**బిట్రగుంట, జులై 26 ప్రభాతవార్త :** బోగోలు మేజర్ పంచాయతీలో శుక్రవారం మండల ఇవోపిఆర్‌డి సి.హెచ్.శ్రీదేవి ఆరోగ్యం, పరి శుభ్రతపై ఇంటింటికి వెళ్లి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఆరోగ్యం, పరి శుభ్రత గురించి అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో బోగోలు పంచాయతీ కార్యదర్శి జహీర్‌ఖాన్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్వనాధరావుపేటలో గ్రామసభ



**బిట్రగుంట, జులై 26 ప్రభాతవార్త :** బోగోలు మండలం విశ్వనాధరావుపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం గ్రామ సర్పంచ్ గందూరు మంజుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితరాలపై తీర్మానించారు. ఈ గ్రామసభలో ఎంపిడివో జమీవుల్లా, ఉపసర్పంచ్ పెండ్లి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## మండలంలో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు



**బిట్రగుంట, జులై 26 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన బోగోలుతో పాటు ముంగమూరు, కోవూరుపల్లి, కడనూతల చెరువులలో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. గత 15 రోజుల నుండి ఈ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు తెలిసీ తెలియనట్లు వుండటం గమనార్హం. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రెండు నెలలోపే పగలు, రాత్రి తేడా లేకుండా భారీ యంత్రాలు, ట్రాక్టర్లను ఉపయోగించి గ్రావెల్‌ను తవ్వి తరలిస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్కు గ్రావెల్ 500 రూపాయల చొప్పున విక్రయాలు జరుగుతుండటం విశేషం. కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి నియోజకవర్గంలో గ్రావెల్, ఇసుకను అక్రమంగా తవ్వినా, తరలించి విక్రయించినా కఠినంగా వ్యవహరిస్తానని ఈ అక్రమాలు చేసే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని,వాటి కమీషన్ల కోసం తాను కక్కుర్తిపడే వాడిని కాదని తాను నియోజకవర్గానికి, ప్రభుత్వ ఆస్తులకు కాపలాదారుడుగా వ్యవహరిస్తానని పదేపదే బహిరంగంగా స్పష్టం చేయడం తెలిసిందే. అయితే దానిని లెక్కచేయని చోటా నాయకులు, కార్యకర్తలు బహిరంగంగా వీటిని తరలిస్తూ ప్రశ్నిస్తున్న అధికారులను ఎమ్మెల్యే పర్మీషన్‌తోనే తాము రైతుల కోసం తోలుకుంటున్నామని చెబుతూ అక్రమార్జన సొమ్ము చేసుకోవడం విమర్శలకు తావిస్తుంది. చెరువులలో యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు చేస్తుండటంతో ఆయకట్టు రైతులు మండిపడుతున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే స్పందించి ఈ అక్రమార్జనకు పాల్పడే వారికి చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## ఆరోగ్యశ్రీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు జులై 26 ప్రభాతవార్త :** ఆరోగ్యశ్రీ ద్వారా ప్రతి ఒక్కరూ కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు పొందే అవకాశం ఉందని, దీనిని వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్ అన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా గర్భవతులకు కాన్పు అయిన తర్వాత నెలకు ఐదు రోజులు వారి ఖాతాలో జమ అవుతుందన్నారు. అదేవిధంగా టెలీ రేడియాలజీ ద్వారా స్టెమీ పథకం ద్వారా గుండె జబ్బు వచ్చిన వారు తగు సేవలను ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా చేయించుకునే అవకాశం ఉందన్నారు. ఒక్కొక్కటి 20 వేలు విలువ చేసే ఇంజక్షన్లు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిద్ధంగా ఉన్నాయన్నారు. అదేవిధంగా ప్రతి సామాజిక ఆరోగ్య కేంద్రం రికార్డు రిజిస్టర్ల నిర్వహణ పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేలా వైద్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు తప్పనిసరిగా ఆధార్‌కార్డుతో పాటు ఆరోగ్యశ్రీ కార్డు కూడా తీసుకురావాలన్నారు. ఇంకా పలు గ్రామాల్లో గిరిజన కుటుంబాలకు ఆశించిన మేర ఆధార్ కార్డులు లేవని, ఈ విషయాన్ని ఇటీవల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఈ ఆధార్ కార్డు సేవలపై వారిలో అవగాహన కల్పించేలా ఆరోగ్య సిబ్బంది తగు చొరవ తీసుకోవాలన్నారు. అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో మంచి నైపుణ్యం కలిగిన వైద్యులు ఉన్నారని, కుటుంబ నియంత్రణతో పాటు కాన్పులు కూడా చేసే ప్రావీణ్యం వీరిలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, డాక్టర్ సలావుద్దీన్, హెడ్ నర్సు ప్రసూనలత, తదితరులు ఉన్నారు.

## సాంకేతిక మార్పులపై మరింత అవగాహన పెంచుకోవాలి



**కోవూరు జులై 26 ప్రభాతవార్త :** ఇంజనీరింగ్ కళాశాలలో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులు ఇంజనీరింగ్ రంగంలో వస్తున్న నూతన మార్పులపై ప్రత్యేకంగా అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని సైకాలజిస్ట్ డాక్టర్ పీవీరెడ్డి తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు శుక్రవారం కెరియర్ గైడెన్స్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకోవడమే కాకుండా దానిని సాధించే దిశగా ముందుకు సాగాలన్నారు. కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న ఇటువంటి అవగాహన సదస్సులను వారు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె సందీప్‌కుమార్, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌అండ్‌హెచ్ విభాగాధిపతి పీఎం కిషోర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వై. మురళీకృష్ణ, అధ్యాపకులు ఉన్నారు.

## సాంకేతిక అంశాలపై అవగాహన అవసరం



**కోవూరు జులై 26 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రాథమిక దశ నుంచి ప్రభుత్వం అందిస్తున్న నూతన సాంకేతిక అంశాలపై అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉందని మండల విద్యాశాఖ అధికారి -2 వై. చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం సప్తాహ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నూతన టెక్నాలజీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు , ట్యాబ్‌లు తదితర వాటిని విద్యార్థులకు అందజేయడం జరిగిందని, వీటి ద్వారా వారు మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న అంశాలను పూర్తిస్థాయిలో ఆకళింపు చేసుకోవాలన్నారు. తద్వారా ఇంగ్లీష్ భాషపై మంచి పట్టు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ, ఉపాధ్యాయురాలు గీతామాధురి, తదితరులు ఉన్నారు.

## నేడు రాపూరు మండల సర్వసభ్య సమావేశం



**రాపూరు, జులై25ప్రభాతవార్త :** రాపూరు మండల సర్వసభ్య సాధారణ సామావేశం శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు రాపూరు యంపీడీఓ గంగయ్య తెలిపారు. యంపీపీ కుమ్మరిగుంట ప్రసన్న ఆధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని జడ్‌పిటీసి సభ్యులు, అందరూ యంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండలంలోని అన్నిశాఖల అధికారులు,తప్పని సరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

## ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు జులై 26 ప్రభాతవార్త :** ఇంకా పలు గ్రామాల్లో ఆధార్ కార్డు లేని వారు ప్రస్తుతం గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి తెలిపారు. కోవూరు పంచాయతీ పరిధిలోని సచివాలయం-2లో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం ద్వారా ఏ పథకం పొందాలన్నా తప్పనిసరిగా ఆధార్ కార్డు పొంది ఉండాలన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇంకా ఆధార్ కార్డు లేని వారు ఈ కేంద్రాలకు వచ్చి ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉన్నారు.

## సీసీఆర్‌సీ కార్డుల వలన అనేక ఉపయోగాలు



**కోవూరు జులై 26 ప్రభాతవార్త :** పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేసే కౌలు రైతులు తప్పక సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలని దీని వలన వారికి అనేక ఉపయోగాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారిణి పి.సత్యవాణి అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలాలను కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులు ప్రకృతి వైపరీత్యాల వలన ఏమైనా నష్టం సంబవిస్తే ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అంతేకాకుండా వ్యవసాయ శాఖ అందిస్తున్న వివిధ పథకాలు, సబ్సిడీతో పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. వీటితో పాటు బ్యాంకుల ద్వారా కూడా రుణాలు పొందేందుకు సీసీఆర్‌సీ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు నర్సోజీ వ్యవసాయ శాఖ అందిస్తున్న వివిధ పథకాలపై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు వంశీ, నారాయణ, చైతన్య, శ్వేతలేఖ, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, రైతులు ఉన్నారు.

## జలజీవన్ మిషన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు జులై 26 ప్రభాతవార్త :** మండలంలోని అన్ని గ్రామాల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ఏర్పాటు చేసిన జలజీవన్ మిషన్ పనులను ప్రజలు పూర్తిస్థాయిలో ఉపయో గించుకోవాలని ఈవోపీఆర్డీ నాగూ ర్‌వలి అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీలో శుక్రవారం ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోకి ప్రజలకు సురక్షితమైన నీరు అందించాలనే ఉద్దేశంతోనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా ప్రజలు చెత్తాచెదారాలను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త కుండీలను ఉపయోగించుకోవాలన్నారు. ముఖ్యంగా పంచాయతీ అభివృద్ధికి ప్రజలు చెల్లించాల్సిన ఇంటి పన్నులు, కుళాయి పన్నులను సకాలంలో చెల్లించాలిని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్ మాట్లాడుతూ ఇంకా ఎవరి ఇంటిలో నైనా వ్యక్తిగత మరుగుదొడ్లు లేకపోతే అటువంటి వారు ప్రభుత్వం అందించే సహకారంతో వాటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీవాణి , పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు పలు సూచనలు చేశారు.

## వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటించాలి



**లేగుంటపాడు(కోవూరు) జులై 26 ప్రభాతవార్త :** ప్రస్తుత వరి సీజన్‌లో వరిపొలాల్లో ఎడగారుకు సంబంధించి కేఎన్‌ఎం 1650 రకం రైతులు వేసి ఉన్నారని ఎరువుల యాజ మాన్యం సక్రమంగా అమలు చేయకపోవడం వలన ఆకుము డత, మోమిపిప్పి, తెగుళ్ల సోకి ఉన్నాయని, ఈ సమయంలో వ్యవసాయ శాఖ సలహాలు సూచనలను రైతులు తప్పక పాటించాలని జిల్లా వ్యవసాయాధికారిణి పి. సత్యవాణి తెలిపారు. స్థానిక లేగుంటపాడు గ్రామంలోని వరి పొలాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిలకల దశలో వేపనూనె 5 మిలీ లీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వీటి వలన రెక్కల పురుగులు పైరుపై చెడు వాసనకు వికర్షింపబడి గుడ్లు పెట్టకుండా పోతాయన్నారు. పైరు లేత దశలో గుళికలు కూడా పనిచేస్తాయని, చిరుపుట దశ దాటిన తర్వాత ప్రభావం నిదానంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా పైరు లేత దశలో పొటాష్ వాడడం వలన పైరుకు వ్యాధి నిరోధక శక్తి ఏర్పడి తెగుళ్ల ఉధృతి ఎక్కువగా ఉండదన్నారు. ఎకరాకు పొటాష్‌ను 35 కిలోలు మాత్రమే వాడాలని ఈసందర్భంగా ఆమె రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత, మండల వ్యవసాయాధికారిణి ఇందిరావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు వంశీ, నారాయణ, చైతన్య, శ్వేతలేఖ, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, రైతులు ఉన్నారు.

## నేడు రాపూరు పంచాయితీ కార్యలయంలో ఆధార్ ఆప్‌డేట్



**రాపూరు, జులై26ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని గ్రామ పంచాయితీ కార్యల యం(సచివాలయం),వద్ద ఆధార్ ఆప్‌డేట్ కార్యక్రమం శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. రాష్ట ప్రభుత్వఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో బాగంగా 5 సంవత్సరాలు వున్న చిన్నారులకు ఈ ఆధార్ ఆప్‌డేట్ చేయించాలని ఆయన తల్లితండ్రులకు సూచించారు. ప్రతి చిన్నారి తల్ల తండ్రులు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారని ఈ అవకాశాన్ని చిన్నారుల తల్లితండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## అసెంబ్లీ స్పీకర్,ఇరిగేషన్ మంత్రులతో ఎమ్మెల్యే కురుగోండ్ల భేటి



**రాపూరు, జులై26ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు,ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడులను శుక్రవారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ కలిశారు. అసెంబ్లీ ఆవరణలోని స్పీకర్ ఛాంబర్‌లో వారిని కలసిన ఆయన వారికి అభినందనలు తెలిపారు. అనంతరం నియోజకవర్గానికి సంబందించిన పలు సమస్యలపై ఎమ్మెల్యే రామకృష్ణ వారితో చర్చించారు.నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సంబందించి సహాకారం అందజేయాలని వారిని ఎమ్మెల్యే కోరారు.

## వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వసతులు కల్పించాలి



**కావలి రూరల్, జులై 26 ప్రభాతవార్త :** కావలి ఏరియా వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వసతులు అందించాలని కన్స్యూమర్ రైట్ ప్రొటక్షన్ ఫోరం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బెల్లంకొండ మములు కోరారు. ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ రైట్స్ ప్రొటక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కె.తిరుపాల్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ నగళ్ళ ఉదయ్‌కుమార్ ఆదేశాల మేరకు ఎపిసిఆర్‌పిఎఫ్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బెల్లంకొండ మముల శుక్రవారం కావలి ప్రభుత్వ ఏరియా వైద్యశాలను ఫోరం సభ్యులతో కలిసి పరిశీలించారు. రోగులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. ఆమె వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతితో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా బెల్లంకొండ మములు మాట్లాడుతూ వైద్యశాలలో వసతులపై రోగులను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. రోగులు పలు సమస్యలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి, సిబ్బందిని కోరామన్నారు. రోగులకు మెరుగైన వసతులు కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి డివిజన్ ఫోరం అధ్యక్షులు వంటేరు రోహణి, జిల్లా ఇసి మెంబర్ నాగరాజు, శ్రీనివాసరావు, గోపి, దుగ్గిరాల నాగరాజు పాల్గొన్నారు.

## ప్రశాంతి రెడ్డి ఎయిర్ కూలర్ బహుకరణ



**విడవలూరు, జులై 26, ప్రభాతవార్త:** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి విడవలూరు తాసిల్దార్ కార్యాలయంకు ఎయిర్ కూలర్ శుక్రవారం మండల పార్టీ అధ్యక్షులు చెముకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసమే ప్రజలు ప్రభుత్వ కార్యాలయం వచ్చినప్పుడు త్రాగునీటి కి ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రశాంతి రెడ్డి కుటుంబం ప్రజలను ఆదుకోవడమే వాళ్ల లక్ష్మణి తెలియజేశారు.ప్రతి ఏడాది ఒక్క ప్రభుత్వ కార్యాలయానికి ప్రశాంతి రెడ్డి ఆధ్వర్యంలో ఎయిర్ కూలర్ మిషన్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ భాను ప్రకాష్,మండల సర్వేయర్ శోభన్ బాబు,ఆర్ ఐ,వీఆర్వోలు,టిడిపి పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి



**నెల్లూరు, జులై 26, ప్రభాతవార్త - వైద్యం :** సీజనల్ వ్యాధులైన డెంగ్యూ మలేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ మల్లి పెంచలయ్య ఆదేశించారు. శుక్రవారం నగరంలోని డిఎంహెచ్ఓ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ మాట్లాడుతూ అందరూ అంకితభావంతో ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలందించాలని, సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, డయేరియాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మన ఆరోగ్యం - మన చేతుల్లోనే ఉంది అని భావాన్ని ప్రజల్లో కలిగించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు తగు ప్రాధాన్యం ఇవ్వాలని, తాగునీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు నిర్వేత హెడ్ క్వార్టర్లో ఉండాలని, ప్రతికూల వార్తలకు వెంటనే స్పందించి, వివరణను సంబంధిత వార్తా పత్రికలకు అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. ఎస్‌కె విశాదర్వతి, ఐడిఎ ఎటిఓ మాట్లాడఉతూ వ్యాక్సినేషన్ ఐఆర్ కార్యక్రమంను పటిష్టంగా అమలు పరచాలని, ఎల్‌సిడి సర్వేలో కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించి సత్వరచికిత్స అందజేయాలని ఆదేశించారు. ఏ. ఉమామహేశ్వరి మాట్లాడుతూ సకాలంలో గర్భిణి స్త్రీలు, పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి టీకాలివ్వాలని ఆదేశించారు. డాక్టర్ ఎన్‌వి సుధీర్ మార్ ఎసిడి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి పాఠశాలకు వెళ్లే పిల్లలలో ఎనీమియా (రక్తపోటు) రాకుండా తగు చర్యలు చేపట్టాలని, వ్యక్తి గత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి వనరుల పరీక్షలు చేయడంలో అలసత్వం కూడదని అన్నారు. డిఎంఓఈ హుస్సేనమ్మ వర్షాకాలం వచ్చినందున దోమల నివారణ చర్యలు పటిష్టంగా చేపట్టి, దోమల లార్వాలను నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. ఆర్. వాసవి, సిసి పి. కన్సలెంట్ వ్యాధుల నివారణకు, మాతా శిశు సంరక్షణకు ఆరోగ్య విద్య ప్రాధాన్యతను పిపిటి ద్వారా తెలియజేశారు. డాక్టర్ ఏ. నిశ్చల ప్రసాద్, ఎఆర్ కిడ్నీ హాస్పిటల్స్ డైరెక్టర్, నెల్లూరు యూరాలాజికల్ ఎమర్జెన్సీ పిపిటి ఈ సమీక్ష సమావేశంలో డాక్టర్ ఎం. ప్రియంవధ తదితరులు పాల్గొన్నారు.

## బీద రవిచంద్రని మర్యాదపూర్వకంగా కలిసిన కేఈ శ్యాంబాబు



**నెల్లూరు, జులై 26, ప్రభాతవార్త - వైద్యం :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ శాసనమండలి సభ్యుడు బీద రవిచంద్రని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాలయంలో శుక్రవారం కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గ శాసనసభ్యుడు కేఈ శ్యాంబాబు మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా వారు ఇరువురు పలు అంశాలపై కాసేపు చర్చించుకున్నారు.

## పొదలకూరులో రవాణా శాఖ అధికారులు దాడి



**పొదలకూరు, జులై 26, ప్రభాతవార్త :** పొదలకూరు మండలంలో గత రెండు రోజుల నుంచి రవాణా శాఖ అధికారులు మెరుపు దాడులు చేసారు. వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు లేని వాహనాన్ని సీజ్ చేసుకున్నారు. ఇప్పటికీ రెండు రోజుల్లో రెండు లక్షల రూపాయిలు వరకు జరిమానా విధించినట్లు ఎంవిఐ బాలమురళి కృష్ణ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పలు వాహనాలను తనిఖీ చేస్తూ సరైన ధృవీకరణ పత్రాలు లేని వాహనాలను పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉండే ప్రాంగణంలోకి సీజ్ చేసిన వాహనాలను తరలించారు. ఈ సందర్భంగా ఎంవిఐ బాలమురళి కృష్ణ మాట్లాడుతూ జిల్లాలో పది వేల వివిధ రకాల వాహనాలు పన్నులు చెల్లించకుండా ప్రయాణిస్తున్నారని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బృందాలుగా ఏర్పడి దాడులు చేస్తున్నట్లు తెలిపారు. సకాలంలో వాహనదారులు పన్నులు చెల్లించి ఫెనాల్టీలు పడకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అలాగే సోషల్ మీడియాలో వస్తున్న వధంతాలను నమ్మవద్దని ద్విచక్రవాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని లేకపోతే చర్యలు తప్పవని ప్రమాదాల నివారణకు అధికారుల సూచనలను తప్పక పాటించాలని ఆయన తెలిపారు.

## ల్యాబ్ టెస్ట్ కేంద్రాన్ని పరిశీలి డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్



**కోవూరు జులై 26 ప్రభాతవార్త :** సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వచ్చే రోగులకు ల్యాబ్‌లో ఉన్న టెస్టులను సకాలంలో సిద్ధం చేసి వారికి అందజేసేలా ల్యాబ్ టెక్నీషియన్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ల్యాబ్ టెస్ట్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ప్రధానంగా ఈ ల్యాబ్‌కు ఏయే పరీక్షలు ఎక్కువగా వస్తున్నాయి.. వాటిని నిర్ధారించడంలో ఎంత సమయం పడుతుంది అనే విషయాలపై ఆయన నిశిత పరిశీలన చేపట్టారు. అదేవిధంగా ప్రతి సామాజిక ఆరోగ్య కేంద్రంలో వచ్చే రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేలా వైద్యులు, ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ఓపీ రిజిస్టర్లకు సంబంధించి ఏ విధంగా నమోదు చేయాలి అనే విషయాలపై సంబంధిత సిబ్బందికి అవగాహన కల్పించడమే కాకుండా ఓపీకి వచ్చే రోగులకు కూడా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటాచలపతి గౌడ్, డాక్టర్ సలావుద్దీన్, హెడ్ నర్సు ప్రసూనలత, తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవతో బాలికల హాస్టల్‌లో వెలుగులు





**కోవూరు జులై 26 ప్రభాతవార్త :** ప్రజలపై పెత్తనం చేసే నాయకురాలిని కాదని, మీకు సేవ చేయడానికి వచ్చిన సేవకురాలిని అని ఎన్నికల ప్రచారం సందర్భంగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పిన మాటలు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక వాటిని తక్షణమే అక్షరాల ఆచరణలో పెడుతున్నారు. వట్టి మాటలు కట్టిపెట్టోయ్.. గట్టి మేలు తలపెట్టవోయ్ అన్న శ్రీ గురజాడ చెప్పిన మాటలు స్ఫూర్తిగా తీసుకుని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. గత వారంలో కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈ నేపథ్యంలో ఆమె ప్రత్యేకంగా విద్యార్థుల దగ్గరకు వెళ్లి ఏమైనా సమస్యలు ఉన్నాయ అడిగారు. ఈ సందర్భంగా సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న పలువురు విద్యార్థినులు కరెంటు పోయినప్పుడు చదువుకోవడానికి తమకు అనేక ఇబ్బందులు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా మంచినీటికి సంబంధించిన మోటార్ మరమ్మతులో ఉందని ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే వీరి మాటలకు స్పందించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాల్లో మూడింటిలో కూడా వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఇన్వర్టర్లు, బ్యాటరీలు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాలన్నీ స్థానిక మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతోపాటు మరమ్మతులకు గురైన మోటార్ స్థానంలో కొత్త మోటార్‌ను కూడా ఏర్పాటు చేశారు. దీంతో సంక్షేమాధికారులు, వసతి గృహాల్లోని బాలికలు తమకు వెలుగులు నింపిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే చెప్పారంటే దానిని ఏర్పాటు చేసేదాక నిద్రపోరని, అటువంటి వారిని ఎమ్మెల్యేగా గెలిపించిన కోవూరు ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా సంక్షేమాధికారులు పద్మ, సుప్రియలు ప్రత్యేకంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి తమ ధన్యవాదాలు తెలియజేశారు.

## చంద్రబాబుని కలిసిన ఎంపి వేమిరెడ్డి



**నెల్లూరు రూరల్, జులై 26, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఢిల్లీలో నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి స్వాగతం పలికారు. ఢిల్లీలో శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఢిల్లీ చేరుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించారు.

## పురుగులమందు తాగి ఎఆర్ కానిస్టేబుల్ మృతి



**అనుమసముద్రంపేట, జులై26, ప్రభాతవార్త :** ఏఎస్‌పేట మండలం కుప్పురుపాడు గ్రామానికి చెందిన ఎఆర్ కానిస్టేబుల్ వెంకటసుధీర్(40) పురుగుల మందు తాగి మృతిచెందాడని బంధువులు తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు కుప్పురుపాడు గ్రామానికి చెందిన ఎఆర్ కానిస్టేబుల్ వెంకట సుధీర్ ఆర్థిక సమస్య , కుటుంబ సమస్యలతో మానసిక సమస్యలున్నాయని ఈనెల 24వ తేదీన నెల్లూరు నుండి గ్రామానికి వచ్చిన సుధీర్ తోడు తెచ్చుకున్న పురుగుల మందును తాగి పడిపోవడంతో తండ్రి గమనించి హుటాహుటిన నెల్లూరు అపోలో ఆసుపత్రికి తరలించారు. గత రెండు రోజుల నుండి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌పేట పోలీసులు ఆసుపత్రికి వెళ్ళి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు.

## జెబి డిగ్రీ కళాశాలను సందర్శించిన విఎస్‌యు ఉపకులపతి ఎస్.విజయభాస్కర్‌రావు



**కావలి రూరల్, జులై 26 ప్రభాతవార్త :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.విజయభాస్కర్‌రావు కావలి జవహర్ భారతి డిగ్రీ కళాశాలను శుక్రవారం సందర్శించారు. అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో విద్యకు సంబంధించిన విషయాల మీద సమీక్షించి తగిన సూచనలు, సలహాలు అందజేశారు. జవహర్ భారతి డిగ్రీ కళాశాలలోని ముఖ్యమైన విభాగాలు, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ ఫూల్, క్రీడా మైదానం, జెబిగార్డెన్‌లను సందర్శించి ప్రశంసించారు. విశ్వోదయ వ్యవస్థాపకులు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి(డిఆర్) కృషిని, అంకితభావాన్ని కొనియాడారు.అనంతరం విక్రమ సింహపురి యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయభాస్కర్‌రావును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్రమణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ ఆర్.మాల్యాద్రి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

## రైతు బజారును ఆకస్మికంగా తనిఖీ చేసిన కావలి ఆర్డీవో





**కావలి, జులై 26 ప్రభాతవార్త :** కావలి పట్టణ ట్రంకురోడ్డులోని రైతు బజారును కావలి ఆర్డీవో, మున్సిపల్ స్పెషలాఫీసర్ వి.కె.శీనానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఆయన మున్సిపల్ అధికారులతో రైతు బజారు, పరిసరాలను పరిశీలించారు. ఎస్టేట్ అధికారితో ఆర్డీవో మాట్లాడారు. రైతు బజారు ప్రతి రోజు పరిశుభ్రంగా వుండాలని ఆదేశించారు. కుళ్లిన కూరగాయల వాసనలు రాకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా తాజా కూరగాయలు వుండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు రైతు బజారులో రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు చోటుచేసుకోకూడదన్నారు.

## కావలి పట్టణంలో డ్రైనేజి పూడికలను తనిఖీ చేసిన కమిషనర్



**కావలి, జులై 26 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని మానస హాలు రోడ్డు, ట్రంకురోడ్డు డ్రైనేజి పూడికల్ని కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్‌కుమార్ స్వయంగా తనిఖీ చేసి పరిశీలించారు. శుక్రవారం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు అభివృద్ధి పనులలో భాగంగా మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ సిబ్బందితో పరిశీలించి త్వరితగతిన పనులను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నియోజకవర్గం సమస్యలపై మాట్లాడిన ఎమ్మెల్యే కాకర్ల



**ఉదయగిరి, జులై 26, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ లోని రాజధాని అమరావతిలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల ప్రశ్నోత్తరాల సమయంలో ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ నియోజకవర్గంలోని సమస్యలపై అధ్యక్ష అంటూ వివరించారు.ముఖ్యంగా జిల్లా కేంద్రానికి 100 కిలోమీటర్ల పైబడి దూరంలో ఉన్న మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధిలో వెనుకబడి ఉందని.వైద్యంనోచుకోక అనేకమంది రోగ గస్తులుగా మిగిలి ఉన్నారని,మరి కొంతమంది ప్రాణాలు విడిచారని వివరించారు .ఎనిమిది మండల్లాలో ఉన్న ఉదయగిరి నియోజకవర్గంలోని కొన్ని మారుమూల గ్రామాలకు మంచినీటి సౌకర్యం లేదని తెలిపారు. మంచినీటి కోసం కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు.మెట్ట ప్రాంతంలో విశాలవంతమైన భూభాగం ఉన్నప్పటికీ సాగునీరు లేక బీడు భూములుగా ఉన్నాయని తెలిపారు.సాగునీరు అందిస్తే వేలాది ఎకరాలు బంజరు భూములుగా మారుతాయని అయన తెలిపారు.అదే విధంగా నియోజకవర్గంలోని ఉదయగిరి మరియు వింజమూరు ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.క్లోరిన్ ప్రభావం వల్ల ఎంతోమంది క్లోరైడ్ బాధితులు ఉన్నారన్నారు.వారందరూ నెల్లూరు వెళ్లి డయాలసిస్ చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.అందుచేత ఉదయగిరి వింజమూరులలో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గారికి సభాపతి శ్రీ గారి ద్వారా విన్నవిం చారు.బిపి షుగర్ మిషన్లు చూడని ఎంతోమంది అభాగ్యులు ఉన్నారని అందుచేత హెల్త్ కేర్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని సభాపతి ద్వారా అసెంబ్లీలో మాట్లాడారు.ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మెట్టవాసులకు వైద్య ఖర్చులు తగ్గించి ఆరోగ్య భద్రత కల్పించాలని ఎమ్మెల్యే శ్రీ కాకర్ల సురేష్ కోరారు.

## సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



**నెల్లూరు క్రైం, జులై 26, ప్రభాతవార్త** జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్‌డేను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పి జి. కృష్ణకాంత్ తెలిపారు. ఈ క్రమంలోనే శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌డే కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని జిల్లాలోని పోలీసు స్టేషన్‌ల నుండి వచ్చిన సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రయత్నించారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది మొత్తం 24 మంది పోలీసులు వారి సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను కూలంకుషంగా విని వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతానని సిబ్బందికి ఎస్పి కృష్ణకాంత్ భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులతో ఎస్పి మాట్లాడి, ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది సంక్షేమంలో భాగంగా ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను తనకు నిర్భయంగా తెలియజేసుకోవచ్చని, సిబ్బంది సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించి గ్రీవెన్స్ డేను ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పి తెలిపారు. సిబ్బంది సమస్యలపై గ్రీవెన్స్ డేను నిర్వహించడం పై సిబ్బంది సంతోషం వ్యక్తం చేసి ఎస్పికి ధన్యవాదాలు తెలిపారు.

## స్వయం సంఘాలు స్వశక్తితో ఎదగాలి





**వింజమూరు, జులై26, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని స్వయం సహాయక సభ్యులు స్వశక్తితో ఆర్థికంగా ఎదగాలని వింజమూరు ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ వై.రామకృష్ణ , గూడూరు ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ వై.బాబురావులు పేర్కొన్నారు. శుక్రవారం వింజమూరు ఎస్‌బిఐ కార్యాలయంలో స్వయం సహాయక సభ్యులకు బ్యాంక్ తరపున చిరు సన్మానం చేశారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ స్టేట్‌బ్యాంక్ స్వయం సహాయక సభ్యుల బృందాలకు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేసిందని రుణాలు పొందిన సభ్యులు సకాలంలో రుణాలు చెల్లిస్తూ బ్యాంక్ అభివృద్ధికి దోహదపడాలన్నారు. బ్యాంక్ పరిధిలో 350సెల్ఫ్‌హెల్ప్ గ్రూపులున్నాయని , ఒక్కో గ్రూపుకు 20లక్షల మేర ఎలాంటి షూ ్యరిటీలు లేకుండా సభ్యుల లావాదేవీలను అనుసరించి రుణాలు అందిస్తున్నా మన్నారు. బాబురావ్ మాట్లాడుతూ వింజమూరు చీఫ్ మేనేజర్ రామకృష్ణ బాధ్యతలు చేపట్టిన ప్పటి నుండి బ్యాంక్ అభివృద్ధికి పట్టణంలో వ్యాపార వేత్తలను , కాంట్రాక్టర్లను , దుకాణాదారులను స్వయంగా కలిసి తమ బ్యాంకులో అందిస్తున్న సేవలను ఇస్తున్న వడ్డీని వివరిస్తూ తన సహచర సిబ్బందితో కలసి బ్యాంక్ అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నా రన్నారు. రుణాలు పొందిన వారు నిర్ణీత సమయంలో జమ చేస్తుండడం వలన మిగిలిన సభ్యులకు కూడా సకాలంలో రుణాలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సిసిలు, విఓఎలు, నిరంతరం గ్రూపు సభ్యులకు అవగాహన కల్పిస్తూ రుణాలు చెల్లించే విధంగా చూడాలన్నారు. అనంతరం మేనేజర్ గ్రూపు సభ్యులకు చీరలను బహూకరించారు. ఫీల్డ్ ఆఫీసర్ మధు, కృష్ణమోహన్, మహేష్, ఎపిఎం కె.సురేష్, సిసిలు సునీత, కృష్ణమూర్తి, లక్ష్మీకుమారి, పార్వతి, ఆదిలక్ష్మి, సువర్తమ్మ, విఓఎలు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వివేకానంద విద్యాసంస్థల డైరెక్టర్ గుండెపోటుతో మృతి



**వింజమూరు, జులై26, ప్రభాతవార్త :** వింజమూరులోని ప్రముఖ విద్యాసంస్థలైన వివేకానంద సంస్థల డైరెక్టర్ మద్దూరు శివకేశవులురెడ్డి గురువారం రాత్రి (58) గుండెపోటుతో మృతిచెందారు. గురువారం సాయంత్రం పాఠశాలలో సాయంత్రం వరకు విద్యార్థులతో కలసి ఉండి సాయంత్రం ఇంటికి వెళ్ళి స్థానం చేసేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్ళగా అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో శివకేశవరెడ్డి మృతిచెందాడు. ఆయన మృతిపట్ల వింజమూరు మండల పలు విద్యాసంస్థల డైరెక్టర్లు, యాజమాన్యం, పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. శివకేశవరెడ్డి మృతి బాధాకరమని, సౌమ్యుడు, స్నేహశీలి అయిన శివకేశవరెడ్డి వివేకానంద విద్యాసంస్థలు ఏర్పాటైనప్పటి నుండి భాగస్వామిగా ఉంటూ విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దారు. గతంలో ఆర్‌ఎస్‌ఎస్, ఎబివిపి సంఘాల్లో క్రియాశీలక సభ్యులుగా పనిచేసి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారన్నారు.

## కన్యకా పరమేశ్వరి ఆలయంలో శాఖాంబరి అలంకారం



**కావలి, జులై 26 ప్రభాతవార్త :** కావలి పట్టణం కొత్తబజారులో వేంచేసి వున్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శాఖాంబరి అలంకారం చేశారు. ఆలయ పూజారి సుబ్బు స్వామి అమ్మవారికి వివిధ రకాల కూరగాయలతో శాఖాంబరి అలంకారాన్ని ప్రత్యేకంగా చేశారు. పట్టణంలోని మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వాసవీ అమ్మవారి శాఖాంబరి అలంకారాన్ని దర్శించుకుని తరించారు. ఆలయ కమిటీ బాధ్యులు భక్తులకు సౌకర్యాలు కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కలువాయిలో సామాజిక తనీఖీ ప్రజావేదిక



**కలువాయి జులై 26 ప్రభాతవార్త :** సామాజిక తనీఖీ ప్రజా వేదికను శుక్రవారం మండల అభివృద్ధి అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పంచాయితీలకు సంబందించి సామాజిక తనీకి నిర్వహణలో మండలంలోని చిన్న గోపవరం,పంచాయితీలో జాతీయ ఉపాధీ హామి పదకంలో జరిగిన పనులలో అవినీతి జరిగిందని ప్రాజక్టు అబుడ్స్ మెన్ వెంకరెడ్డి తెలిపారు. ఈ పంచాయితికి సంబందించి 2 కోట్లు రూపాయాలు పనులు జరిగాయని ఈ పనులలో 44 లక్షల 29 వేల రూపాయాలు తేడా జరిగిందని సోషల్ ఆడిట్ బృందం తనీఖీలో తేలిందని తెలిపారు. ఈనేపద్యంలో సామాజిక తనీఖీ ప్రజావేదిక ఆడిట్ బృందం తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రాజక్టు అసిస్టెంట్ డైరక్టర్ విజయలక్ష్మీ, సామాజిక తనీఖీ సంస్థ సంచాలకులు జదగీష్ కుమార్,ఏపిడి శివశంకర్,ఎంపిడిఓ ప్రభాకర్, ఏపిఓ మురళీ,జడ్‌పిటిసి బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## జొన్నవాడ సచివాలయానికి పిఎం,సిఎం,డిప్యూటి సిఎం పటాలు బహుకరణ



**బుచ్చి జులై 27 ప్రభాతవార్త :** జొన్నవాడ సచివాలయానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ, సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటి సిఎం పవన్‌కల్యాణ్,ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చిత్రపటాలను గ్రామ సర్పంచ్ ,టిడిపి నాయకులు కందికట్టు పెంచలయ్య బహుకరించారు. సెక్రటరీ నారాయణరావు ఆచిత్రపటాలను సచివాలయంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. టిడిపినాయకులు,కార్యకర్తలు ఉన్నారు.

## మత్స్యకారులతో భేటీ అయిన రవిచంద్ర



**నెల్లూరు, జులై 26, ప్రభాతవార్త - వైద్యం :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర యాదవ్‌తో శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కేంద్ర కార్యాల యంలో మత్స్య సహకార సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, ఆప్కాబ్ మాజీ చైర్మన్ కొండూరు పాల్ శెట్టి ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా మత్స్యకారులతో బీద రవిచంద్ర భేటీ అయ్యారు. మొదట బీద రవిచంద్రను ఘనంగా సత్కరించిన మత్స్యకార నేతలు 2.50 లక్షల జనాభా కలిగిన పట్టపు కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేసారు. గతంలో వాడ బలిజ, పల్లె, నెయ్యల, పట్టపు కులాలకు కలిపి మత్స్యకార కార్పొరేషన్ ఏర్పాటు విషయాన్ని మత్స్యకార నేతలు ఆయనకి గుర్తు చేశారు. పట్టపు కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని బీద రవిచంద్ర హామీ ఇచ్చారు.

## దొంగకరెంటు వాడకాన్ని అరికట్టాలి



**నెల్లూరు, జులై 26, ప్రభాతవార్త - వైద్యం :** దొంగ కరెంటు వాడకాన్ని అరికట్టాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ కె. ఆదిశేషయ్య ఆదేశించారు. గురువారం నగరంలోని విద్యుత్ భవన్‌లోని స్కాడా సమావేశ మందిరంలో ఆదిశేషయ్య శ్రీనివాసబాబులు నెల్లూరు జిల్లా డిపిఈ విజిలెన్స్ విభాగం వారితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిజీఎం ఆదిశేషయ్య మాట్లాడుతూ విద్యుత్ చౌర్యంను పూర్తిగా అరికట్టాలని, విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని తెలియజేశారు. వినియోగదారులు కూడా సహకరించి విద్యుత్ చౌర్యానికి పాల్పడకుండా ఉండాలని కోరారు. జిల్లా విజిలెన్స్ విభాగం వారు విద్యుత్ చౌర్యంపై దాడులు నిర్వహించాలని దీనికి అవసరం అయినప్పుడు ఏపిటిఎస్ విభాగం వారి సహకారం తీసుకోవాలని తెలిపారు. ఫీల్డ్‌లో కొత్త సర్వీస్ రిలీజ్ అయినప్పుడు కేటగిరి కరెక్ట్‌గా ఇస్తున్నారో లేదో ఒకసారి చెక్ చేయాలని, ఒక ఇంటికి ఒకే సర్వీస్ ఇవ్వాలని ఒక ఇంటికి రెండు సర్వీస్‌లు ఉన్న యెడల అవి క్లబ్ చేయాలని, ఆక్వా ఏరియాలతో విద్యుత్ చౌర్యం జరుగకుండా నైట్ రైడ్స్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ బి. జగదీష్, సుధాకర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ సుధీర్ పాల్గొన్నారు.

## విద్యార్థి మృతి పై కేసు నమోదు

**నెల్లూరు క్రైం, జులై 26, ప్రభాతవార్త** స్థానిక బీవీ నగర్‌లోని మినీ కెఎన్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్మాణంలో ఉన్న గోడ కూలి విద్యార్థి కొత్తపాలెం గుర్తు మహేంద్ర (14) మృతి చెందిన సంఘటనలో విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు వేదయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. మృతి చెందిన విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి సంఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో భవన నిర్మాణ కాంట్రాక్టర్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు విద్యార్థి తల్లిదండ్రులు బంధువులు ఆరోపిస్తున్న నేపథ్యంలో పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు.

## కామినేనిపాలెంలో వాటర్ ప్లాంట్ పనులు ప్రారంభం



**దగదర్తి, జులై 26 ప్రభాతవార్త :** దగదర్తి మండలంలోని కామినేనిపాలెం గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని కామినేనిపాలెం నాయకులు రత్నం తెలుగుదేశం పార్టీ నాయకులు మాలేపాటి సుధాకర్, మాలేపాటి భానుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు కామినేనిపాలెం గ్రామానికి వెళ్లి వాటర్‌ప్లాంట్‌కు కావాల్సిన స్థలం చూశారు. ఆ స్థలంలో వాటర్‌ప్లాంట్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి నీటిని అందించడమే లక్ష్యం



**వరికుంటపాడు, జులై26, ప్రభాతవార్త :** జలజీవన్ మిషన్ పదకంలో భాగంగ గ్రామంలో వున్న ప్రతి ఇంటికి స్వశ్చమైన నీరందించడమే ప్రభుత్వలక్ష్యమని విరువూరు గ్రామ ఉపసర్పంచ్ పాలకొల్లు భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విరువూరు సచివాలయంలో ప్రత్యేక గ్రామ సభను నిర్వహించారు. ఈసందర్బంగ ఆయన మాట్లాడుతు గ్రామంలో వున్న ప్రతి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రతి గ్రామంలో రక్షిత మంచినీరందించడానికి జలజీవన్ మిషన్ పదకాన్ని చేపట్టారని ఈపదకం ద్వార ప్రతి ఇంటికి కొళాయిలతో త్రాగునీరు అందిస్తామన్నారు. స్వశ్చాంధ్రప్రదేశ్‌లో భాగంగ మరుగుదొడ్లు లేనివారికి నిర్మించుకోవడానికి సహాయం చేయడం జరుగుతుందన్నారు పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధతీసుకొని స్వశ్చ పంచాయతిగ తీర్చిదిద్దుతామన్నారు. మాజీ సర్పంచ్ మాలెం వెంకటసుబ్బారెడ్డి పంచాయతి కార్యదర్శి ఇంతియాజ్‌బేగం, టిడిపి నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కలువాయిలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు



**కలువాయి జులై 26 ప్రభాతవార్త :** కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని కలువాయి బివిఎస్ఆర్ జడ్‌పిహైస్కూల్ నందు 24 వ ఆంధ్ర బెటాలియన్ అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ పెంచల పుల్లయ్య ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్గిల్ విజయ్ దివస్‌డే పూర్తి అయి 25 సంవత్సరాలు అయినందున భారతీయ అమరవీరుల త్యాగాలను విద్యార్థులకు తెలియజేసి వారిలో దేశభక్తి పెంపొందించే విధంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. జులై 26 ,1999లో జరిగిన యుద్ధంలో భారత సైనికులు 527 మంది ప్రాణాలు కోల్పోగా 1363 మంది గాయాలు పాలైయ్యారు. అమరులైన వారికి ఈ సందర్భంగా నివాళులర్పించారు. ఎన్‌సిసి విద్యార్థులను ఆర్మిలో చేర్చేవిధంగా తల్లిదండ్రులు సహకరించాలని ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు పెంచలపుల్లయ్య తెలియజేశారు.

## విద్యుత్ నిలుపుదల

**నెల్లూరు, జులై 26, ప్రభాతవార్త – వైద్యం :** 33/11 డైకస్ రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి రామయ్య బడి ఫీడర్ నందు మరమ్మతుల కారణంగా కొండదిబ్బ, అలంకార్ సెంటర్, బ్రాహ్మణ వారి వీధి, రాజగారి వీధి, శివాలయం గుడి పరిసర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1వరకు 11 కెవి బృందావనం ఫీడర్ నందు పాత కండక్టర్ తొలగించి కొత్త కండక్టర్ ఏర్పాటు పనులు కారణంగా పొగతోట, బబుందావనం పరిసర ప్రాంతాలలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 వరకు 33/11 కెవి హరినాథపురం సబ్ స్టేషన్ పరిధిలోని ఆదిత్య నగర్ ఫీడర్ నందు చెట్టు కొమ్మల తొలగింపు కారణంగా ఫీడర్ పరిధిలో ఆదిత్య నగర్, అయోధ్య నగర్, వెలగచెట్టు సంగం, తదితర ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 బివి నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి సప్తగిరి ఫీడర్ 11కెవి కావేరి నగర్ ఫీడర్‌ల నందు చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పడారు పల్లి, దండోరా కాలనీ, సప్తగిరి లే ఔట్, సప్తగిరి కాలనీ, బివి నగర్, అన్నమయ్య సర్కిల్, ఉమ్మారెడ్డి గుంట పరిసర ప్రాంతాలలో ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 వరకు 33/11 రంగనాథ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవి, రంగనాథ ఫీడర్ , 11 కెవి ఇసుక డొంక 11 కెవి రైల్వే ఫీడర్స్ రోడ్ ఫీడర్ల నందు మరమ్మతుల కారణంగా గోపురం స్ట్రీట్, రంగనాయకులపేట, బుజ్జమ్మ రేవు, ఉప్పర పాలెం, ఇసుక డొంక, గురుతోట, కపాడిపాలెం, సంతపేట పరిసర ప్రాంతాలలో ఉదయం 8.30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుంది. వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు. అత్యవసర విభాగానికి సంబంధంచిన వారు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా విద్యుత్ శాఖ నెల్లూరు టౌన్ డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ. సోమశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు.

## వైకాపా అవినీతికి కట్టడం కూలి విద్యార్థి మృతి చెందటం బాధాకరం



**నెల్లూరు, జులై26 ప్రభాతవార్త–విద్య :** గత వైకాపా ప్రభుత్వ హయాంలో అవినీతి తారాస్థాయికి చేరింది అనేందుకు నేడు గోడ కూలి విద్యార్థి మృతి చెందిన సంఘటనే ప్రత్యక్ష నిదర్శనమని, ఈ సంఘటన తమను ఎంతగానో కలచి వేసిందని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ ఆవేదన వ్యక్తంచేశారు. శుక్రవారం నగరంలోని స్థానిక బివినగర్‌లోని చిన్న కేఎన్ఆర్ పాఠశాలలో గోడకూలి విద్యార్థి మహేంద్ర మృతి చెందిన సంఘటన తెలుసుకున్న ఆయన సంఘటనా స్థలానికి చేరకుని ప్రమాదం సంభవించిన తీరును పరిశీలించి బాధితులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత ప్రభుత్వ హయాంలో నాడు నేడు పేరుతో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. వైకాపా నాయకులే కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి అన్ని పనులు నాశిరకంగా చేశారని, అప్పటి అధికారులు కూడా ఈ నాశిరకం నిర్మాణాలపై స్పందించలేదన్నారు. ఫలితంగా నేడు నిర్మాణం నాణ్యత లేకపోవటంతో నిర్మాణదశలోనే సన్‌సెడ్ పడి విద్యార్థి మహేంద్ర మృతి చెందటం జరిగిందన్నారు. వెంటనే ఈ ఘటనపై విచారణ చేపడతామని, నిందితులను శిక్షించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే భాధిత కుటుంబానికి అన్నీ విధాల ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రశాంత్, కందర్, మౌనేష్ తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు వ్యాధి పై ఎల్‌సిడిసి సర్వే



**పొదలకూరు, జులై 26, ప్రభాతవార్త :** కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి ఎండిటి మందులు వాడితే అంగవైకల్యంను నివారించవచ్చునని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎం. మోహన్ రావు అన్నారు. ఎల్‌సిడిసి సర్వేలో భాగంగా శుక్రవారం ఆయన పొదలకూరులోని ఎమ్మార్వో కాలనీ సందర్శించారు. వైద్య సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనుమానిత కేసులు సంఖ్యలను పెంచాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి సంవత్సరం ప్రభుత్వం చేపట్టే ఎల్‌సిడిసి, ఎసిడిఆర్ఎస్ సర్వేల ద్వారా లెప్రసీ కేసులను గుర్తించి 2027 సంవత్సరానికి కుష్టు వ్యాధి రహిత దేశంగా భారతదేశాన్ని నిలబెట్టాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఎల్‌సిడిసి అనే కార్యక్రమంలో భాగంగా జులై 18వ తేది నుండి ఆగస్టు 2వ తేది వరకు జరిగే సర్వేలో కుష్టు వ్యాధిని గుర్తించడం జరుగుతుందని ఎవరికైనా పాలిపోయిన లేదా రాగి రంగు మచ్చలు లేదా స్పర్శలేని మచ్చలు, చెమట పట్టని మచ్చలు, ఇలాంటివి ఉన్న ఎడల వెంటనే సిబ్బందికి ఆరోగ్య సిబ్బందికి తెలియజేయడం ద్వారా వీరికి త్వరితగతిన ఎండిటి అనే మాత్రల ద్వారా చికిత్స ప్రారంభించడం వలన వారిని అంగవైకల్యం నుండి కాపాడవచ్చునని విద్యార్థులు కూడా కుష్టు వ్యాధి పై అవగాహన కలిగి ఉండాలని, కుష్టు వ్యాధి గ్రస్తుల పట్ల ప్రేమ వాత్సల్యంతో మెలగవల్సిందిగా ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ ఎం. మోహన్ రావు, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆంజనేయ వర్మ, ఆరోగ్య విస్తరణాధికారి టి. రవికుమార్, ఎంఎల్‌హెచ్‌పి సుమాంజలి, ఆరోగ్య సహాయకులు ఎం. రాధా కుమారి, సాని శివప్రసాద్, ఆశలు పాల్గొన్నారు.

## కలుగోళ శాంభవి ఆలయంలో శాఖాంబరి అలంకారం



**కావలి, జులై 26 ప్రభాతవార్త :** కావలి పట్టణ గ్రామదేవత శ్రీ కలుగోళ శాంభవి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శాఖాంబరి అలంకారాన్ని నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు.

## జంప్ రోప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కరేడు విద్యార్థులు





**ఉలవపాడు, జులై 26, ప్రభాతవార్త :** మండలంలోని కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి జంప్ రోప్(స్కిప్పింగ్) పోటీలకు ఎంపికైనట్లు శుక్రవారం పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు రామిశెట్టి శ్రీనివాసులు తెలియజేశారు. ఈనెల మొదటి వారంలో కరేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఉమ్మడి ప్రకాశం జిల్లా జంప్ రోప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో 8వ తరగతి చదువుతున్న తాటిపర్తి ఉపదేష్ అండర్–14 విభాగంలో, ఐదో తరగతి చదువుతున్న కొక్కిలిగడ్డ వర్షిత అండర్–12 విభాగంలో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపియ్యారు. వీరు ఈనెల 27,28వ తేదీల్లో నంద్యాలలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఒగుబోయిన శ్రీనివాసులు తెలియజేశారు. పాఠశాల విద్యార్థులు ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు, స్టాఫ్ సెక్రటరీ కే.కృష్ణ, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

## ఇంటర్ మీడియట్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ



**కలువాయి జులై 26 ప్రభాతవార్త :** మండలంలోని కుల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు శుక్రవారం ప్రిన్సిఫల్ ఎస్‌కె మహబూబాషా ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు ఇంటర్ మీడియట్ పాఠ్యపుస్తకాలు అందజేశారు. పేద మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న నోటి పుస్తకాలు పాఠ్యపుస్తకాలను అందించడం జరిగిందని విద్యార్థులు అవగాహనతో విద్యనభ్యసించాలని ప్రిన్సిపల్ కోరారు. ఈ ఏడాది కళాశాలకు చెందిన విద్యార్థి జోస్నవి అమరావతిలోని ఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో పిఎస్‌వి నందు సీటు సంపాదించినందుకు కళాశాల ప్రిన్సిఫల్ అద్యాపకులు విద్యార్థినికి అబినందనలు తెలిపారు.

## జిఒఎంఎస్ నెంబర్ 117ను రద్దు చేయాలి



**వింజమూరు, జులై26, ప్రభాతవార్త : ప్రభుత్వం** అందజేసిన 117 జిఒ నెంబర్‌ను రద్దుచేసి జిఒ నెంబర్ ఎంఎస్ నెంబర్ 55ను పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్య ఫెడరేషన్ వింజమూరు శాఖ ఎంఇఒను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్బంగా యుటిఎఫ్ నాయకులు చెంచలబాబు, ఆర్.వెంకటేశ్వర్లురెడ్డి, మీరావలి మాట్లాడుతూ ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.వీరాంజనేయులు, ఎల్.శ్రీనివాసులు, వై.పరమేశ్వరరావ్, ఎస్.సుప్రియ, సి.హెచ్.శివకుమార్, రాజశేఖర్, కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో విద్యార్థి మృతి చెందడం బాధాకరం



**నెల్లూరు రూరల్, జులై 26, ప్రభాతవార్త :** నెల్లూరులోని కేఎన్ఆర్ పాఠశాలలో సన్షెడ్ కూలి విద్యార్థి గురు మహేష్ మృతి చెందడం చాలా బాధాకరమని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థి పాఠశాలలో కన్నుమూయడం కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ఎంపి వేమిరెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదానికి కారణమైన వారిని ప్రభుత్వం తప్పకుండా శిక్షిస్తుందని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## కావలి రైతు బజారు ఆక్రమణలు తొలగించిన తీరును పరిశీలించిన ఆర్డీవో



**కావలి, జులై 26 ప్రభాతవార్త :** కావలి పట్టణ రైతు బజారు ముందు వున్న ఆక్రమణలను తొలగించిన తీరును కావలి ఆర్డీవో, మున్సిపల్ స్పెషలాఫీసర్ వి.కె.శీనానాయక్ శుక్రవారం పరిశీలించారు. మున్సిపల్ అధికారులతో ఆ ప్రాంతాన్ని సందర్శించారు. రైతు బజారు వద్ద ట్రాఫిక్ సమస్య పునరావృతం కాకుండా, మళ్లీ ఆక్రమణలు చోటుచేసుకోకుండా శాశ్వతమైన చర్యలను చేపట్టాలని అధికారుల్ని ఆదేశించారు.

## బావిలో పడి వ్యక్తి మృతి



**మనుబోలు, జులై 26, ప్రభాతవార్త :** మండలంలోని లక్ష్మీనరసింహపురం గ్రామంలో శుక్రవారం బావిలో పడి కే.లక్ష్మీనరసింహప్రసాద్(47)మృతి చెందాడు. పొలాల్లో ఉన్న ఉప్పలపాటి బావిలో పడి చనిపోయినట్లు పోలీసులు గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇందుప్రియ, శ్రీప్రణితిసాయి అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడికి భార్యతో విభేధాల వల్ల ఆమె దూరంగా ఉన్నట్లు సమాచారం. లక్ష్మీనరసింహ ప్రసాద్ గత కొద్ది రోజులుగా మతిస్థిమితం లేకుండా తిరుగు తున్నాడని పోలీసులకు తెలిపారు. శుక్రవారం మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించి పోలీసులు కేసు నమోదు చేస్తున్నారు.

## విద్యుత్ షాక్‌తో నాలుగు గేదెలు మృతి

**బిట్రగుంట, జులై 26 ప్రభాతవార్త :** బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ పందిగుంటలో శుక్రవారం విద్యుత్ షాక్‌తో నాలుగు గేదెలు మృతి చెందాయి. మేత మేస్తున్న గేదెలపై 11 కెవి విద్యుత్ లైన్ తెగి పడడంతో గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ద్వారం కొండయ్య అనే రైతుకు చెందిన గేదెలుగా గుర్తించారు. ఈ నాలుగు గేదెల విలువ సుమారు 2.80 లక్షలు వుంటుందని బాధిత రైతు తెలిపాడు.

## బంగారు, వెండి ఆభరణాలు తనిఖీ



**బిట్రగుంట, జులై 26 ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన బంగారు, వెండి ఆభరణాల ను గుంటూరు జువెలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ చంద్రమౌళి తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిట్రగుంట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అప్రైజర్ ఆఫీసర్ ఎస్.కుమార్, కోవూరు దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ సుధీర్‌బాబు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి అరవ రాధాకృష్ణ, పరిశీలకులు సి.హెచ్.కృష్ణప్రసాద్‌లు పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్లో ప్రేమ జంట కిరికిరి

కలిగిరి, జులై26, ప్రభాతవార్త; పోలీస్‌స్టేషన్‌కి చేరిన ప్రేమ జంట విషయంలో కొంత కిరికిరి జరగడంతో ప్రేమజంట రచ్చ బజారుకెక్కింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు కొండాపురం మండలానికి చెందిన అబ్బాయి కలిగిరి మండలంలోని ఓ గ్రామానికి చెందిన అమ్మాయి ప్రేమించుకొని ఇంటినుండి వెళ్లిపోయారు. అయితే వీరిరువురు తమకు రక్షణ కల్పించాలని శుక్రవారం పోలీస్ స్టేషన్‌కి చేరారు. తరువాత ఏమి జరిగిందో తెలియదు కానీ అమ్మాయిని ఆమెతరపువారు ఇంటికి తీసుకెళ్లే ప్రయత్నంలో ఇరువర్గాలమధ్య పెద్దగలబానే జరిగినట్లు తెలుస్తుంది. దీనితో తేరుకున్న పోలీసులు ఇరువర్గాలనుచెదరకొట్టి ప్రేమజంటను పోలీస్ అదుపులో ఉంచుకున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా పోలీస్ ఆశ్రయం పొందను వచ్చిన ప్రేమజంట విషయంలో పోలీసులు కొంత ఉదాశీనంగా వ్యవహరించారనే వార్తలు ప్రజలనుండి వినిపిస్తున్నాయి.

## ఎస్పి కృష్ణకాంత్‌ను కలిసిన దుగ్గిశెట్టి

నెల్లూరు క్రైం, జులై 26, ప్రభాతవార్త : నెల్లూరు జిల్లా ఎస్పిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జి. కృష్ణకాంత్‌తో జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్ బాబు శుక్రవారం మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. పలు రాజకీయ అంశాలను వారు చర్చించారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే జరిగిన రొట్టెల పండగ విజయవంతానికి జిల్లా పోలీసు యంత్రాంగం తరపున మంచి సహాయ సహకారాలు అందించారని ధన్యవాదాలు తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ పొడిగింపు

నెల్లూరు అర్బన్, జులై 26, ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ పథకాన్ని 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి పొడిగించిందని సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ సదారావు తెలిపారు. జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు వారిపై ఆధారపడ్డ కుటుంబసభ్యులకు ఈ సదుపాయాన్ని అందిస్తారని తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తరహాలో వైద్య సేవలు పొందవచ్చన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్‌హెల్త్ స్కీమ్ ద్వారా పొందే వైద్య సేవలు విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని, అదే విధంగా నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఓపి సేవలు పొందవచ్చని ఆయన వివరించారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులందరు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని డిడి తెలిపారు. ఇప్పటికే కొంత మంది జర్నలిస్టులు రెన్యువల్, చేసుకున్నారని, ఇంకా ఎవరైనా అక్రెడిటేషన్ కలిగిన జర్నలిస్టులు రెన్యువల్ చేసుకోనట్లయితే వెంటనే చేసుకోవాలన్నారు. వైబ్‌సైట్ ద్వారా రూ. 1250 చెల్లించి 31 మార్చి 2025 వరకు లబ్ధిపొందాల్సిందిగా తెలిపారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, అక్రిడిటేషన్ జెరాక్స్, హెల్త్ స్కీమ్ దరఖాస్తు, కుటుంబ సభ్యుల ఫోటోలు, ఒరిజినల్ ఆధార్ కార్డులను లోడ్ చేసిన సిడిను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి వారి కార్యాలయం, సమాచార పౌర సంబంధాల శాఖ, నెల్లూరు కార్యాలయంలో అందజేయాల్సిందిగా కోరారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## వెన్నవాడలో గ్రామసభ




**ఆత్మకూరు, జులై26, ప్రభాతవార్త :** మండలంలోని వెన్నవాడలో శుక్రవారం పారిశుద్యం, జలజీవన్ మిషన్ గురించి ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఇంటింటికి వెళ్ళి తడిచెత్త, పొడిచెత్త స్వీకరణకు చెత్తబుట్టలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ జగన్నాథం లక్ష్మమ్మ, ఎంపిటిసి సభ్యులు కంభంశెట్టి ప్రమీల, టిడిపి నాయకులు ఏలూరు కిరణ్, పంచాయతీవార్డు మెంబర్ , జనసేన నాయకులు పసుపులేటి శ్రీరామ్, అధికారులు కృష్ణయ్య, దీప, రుచిత, శ్రీను , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.